
భూ మార్పిడి... కాసుల కావడి

■ సీనియర్ సహాయకుడి దందా

■ అర్బన్ ఆర్డీవో కార్యాలయాన్ని శాసిస్తున్న అధికారి



నామిని వీఆర్వోగా విధుల్లో చేరారు. సీనియర్ సహాయకుడి హోదా పొందారు. ఉన్నతాధికారుల అండదండలతో రెండేళ్లుగా రెండు పోస్టుల్లో 'కొలువు'దీరారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖను శాసిస్తున్నారు. వైకాపా నేతలతో జత కట్టి స్థిరాస్తి దందా మొదలు పెట్టారు. గుట్టుగా 'భూ'మార్పిడిలు చేయిస్తూ రూ.లక్షలు వెనకేసుకొంటున్నారు. ఏకంగా తహసీల్దార్, వీఆర్వోల సంతకాలు లేకుండానే సాగు భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేస్తున్నారు. 'వృత్తి' ధర్మాన్ని విస్మరించారు.. ఉద్యోగోన్నతిలో ఫెయిల్ అయ్యారు.. అవినీతి అక్రమాల్లో పాసయ్యారు. 'రివర్షన్లు' మరో రెండేళ్లపాటు సీనియర్ అసిస్టెంట్‌గా కొనసాగించాలని ఉన్నతాధికారులతో బేరసారాలు నిర్వహించడం తాజాగా వెలుగులోకి వచ్చింది. కర్నూలు ఆర్డీవో కార్యాలయాన్ని శాసిస్తున్న ఓ అధికారి అవినీతి బాగోత మిది!

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే:

70 శాతం ఆయన ద్వారానే..

కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులొచ్చాయి. అందులో 70 శాతానికిపైగా ఆ సీనియర్ సహాయకుడు ద్వారానే భూమార్పిడి జరిగినట్లు తెలుస్తోంది. ఆయన ఆర్డీవో కార్యాలయానికి వచ్చారంటే కేవలం ల్యాండ్ కన్వర్షన్ చేయించుకొనేందుకు తప్ప మరే ఇతర పనులకు రాడనే ముద్ర పడిపోయింది.

అధికారులకు ఆర్థిక సాయం

అర్బన్ మండలానికి ఆర్ఐగా విధులు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.. ఆయనైతే ప్రొటోకాల్ విధులు సమర్థంగా నిర్వహిస్తారు.. అవసరమైతే సొంతంగా డబ్బులు ఖర్చు చేస్తారని ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రొటోకాల్ విధులకు రూ.10 వేలు ఖర్చు చేసి.. ప్రతిఫలంగా రూ.50 వేల పనులు చేయించుకుంటాడనే ప్రచారం ఉంది. ఎన్నికల సమయంలో ఓ తహసీల్దార్‌కు అద్దె కారు, డ్రైవర్ బత్తా, ఇంటి అద్దె.. ఇలా రూ.40-50 వేల వరకు ఆర్థిక సాయం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులకు అన్నీ సమకూరుస్తుండటంతో ఆయన తీసుకెళ్లే ల్యాండ్ కన్వర్షన్ దరఖాస్తులకు 'నో' చెప్పకుండా సంతకాలు చేసేస్తున్నారు.

గుట్టుగా నడిపిస్తున్నారు

● వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలంటే ముందుగా తహసీల్దార్‌కు అర్జీ పెట్టుకోవాలి. వీఆర్వో లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక ఇస్తారు.. దాన్ని ఉప తహసీల్దార్ లేదా సీనియర్ సహాయకుడు నిర్ధారించిన తర్వాతే తహసీల్దార్ ధ్రువీకరించి ఆర్డీవోకు పంపిస్తారు. ఎకరానికి మార్కెట్ 'విలువ' ఎంత ఉందో అందులో ఐదు శాతం డబ్బులు ప్రభుత్వ ఖజానాకు చెల్లించిన తర్వాత తహసీల్దార్ నివేదికల ఆధారంగా ఆర్డీవో భూమార్పిడి చేస్తారు.

● జిల్లా కేంద్రంలో రెవెన్యూ శాఖలో పని చేస్తున్న ఓ సీనియర్ సహాయకుడు చక్రం తిప్పుతున్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో పెత్తనం చేస్తున్నారు. "మీ గ్రామంలో భూమార్పిడి జరిగిందని సహచర వీఆర్వోలు చెబితే తప్ప ఆ గ్రామ వీఆర్వోలకు తెలియడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రెవెన్యూ ఉన్నతాధికారులతో సత్సంబంధాలు పెట్టుకొన్న సదరు అధికారి వీఆర్వోలు, తహసీల్దార్లకు తెలియకుండానే ల్యాండ్ కన్వర్షన్ చేస్తుండటం గమనార్హం.

అక్రమాల ఉదాహరణలు

● గూడూరు మండలంలో తహసీల్దార్, కింది స్థాయి అధికారుల సంతకాలు లేకుండానే వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేయించారు.. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన అక్కడి తహసీల్దార్ అవాక్కయ్యారు. ఆరా తీయగా 'సీనియర్' సహాయకుడు చేయించినట్లు తేలింది.

● కర్నూలు గ్రామీణ మండలం గార్గేయపురంలో సర్వే నంబరు 375-ఎలో 3.00 ఎకరాలు, 375-బిలో 3.01 ఎకరాలు కలిపి మొత్తం ఆరెకరాల సాగు భూమిని వీఆర్వోల సంతకాలు లేకుండా, వారికి తెలియకుండానే వ్యవసాయేతర భూమిగా మార్చి తహసీల్దార్‌తో సంతకం చేయించి ఆర్డీవో కార్యాలయానికి దస్త్రాన్ని పంపి పని చేయించారు.

● కర్నూలు అర్బన్ మండలంలో మామిదాలపాడులో సర్వే నంబరు 165-1బిలో 1.72 ఎకరాలు, 165-2ఎ2లో 7.44 ఎకరాలు కలిపి మొత్తం 9.16 ఎకరాల భూములను వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేయించారు. ఈ వ్యవహారంలో సీనియర్ సహాయకుడు మరికొందరు పెద్ద రెవెన్యూ అధికారులు రూ.20 లక్షలు పంచుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆలయ ఆదాయానికి కన్నం

■ రూ.1.30 కోట్లతో ఈవో పరారీ



ఈనాడు, కర్నూలు: దేవాదాయ శాఖలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కొందరు సిబ్బంది నిధులు బొక్కేస్తున్నారు. ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గలోని బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన రూ.1.30 కోట్లు ఈవోనే పక్కదారి పట్టించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ బి.సుధాకర్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా ఆలయ ఈవో డి.ఆర్.కె.ప్రసాద్ అందుబాటులో లేకుండా పోయారు. నిధులు పక్కదారి పట్టినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో ఆయనపై వెంటనే పోలీసు కేసు నమోదు చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు లేఖరాశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నిధులు మొత్తాన్ని పక్కదారి పట్టించినట్లు బ్యాంకు అధికారులు ఇచ్చిన సమాచారం ఆధారంగా సహాయ కమిషనర్ గుర్తించారు.

కొరవడిన పర్యవేక్షణ

జిల్లా దేవాదాయశాఖ పరిధిలో సుమారు 1,950 ఆలయాలు ఉన్నాయి. వాటిలో కేవలం 131 ఆలయాలపైనే దేవాదాయశాఖ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంది. జిల్లా దేవాదాయశాఖ పరిధిలో కేవలం 13 మంది ఈవోలు అందుబాటులో ఉన్నారు. ఆలయాల బాధ్యతలు పర్యవేక్షించడమే వారికి గగనంగా మారుతోంది. పలు దేవాలయాలను గ్రూపుగా చేసి వాటికి ఈవోలను కేటాయిస్తున్నారు.

సగం భూముల కబ్జా

జిల్లాలో రూ.1000 కోట్లకు పైగా విలువైన భూములు అన్యాక్రాంతమైనా ఉన్నతాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. 32 చోట్ల 283.46 ఎకరాల భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. అనధికారికంగా మరిన్ని వందల ఎకరాల భూములు ఆక్రమణల చెరలోనే కొనసాగుతున్నాయి. ఆయా ఆక్రమణలపై పెట్టిన కేసుల విచారణలు 2009 నుంచి నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఆక్రమణలకు సంబంధించిన వివరాలను న్యాయస్థానాలకు సకాలంలో సమర్పించి ఆయా భూములను కబ్జా కోరల నుంచి విముక్తి చేసుకోవాల్సిన అవసరం ఉన్నా ఆ ప్రక్రియ ఆశించినంత వేగంగా జరగకుండా కొందరు దేవాదాయశాఖ ఉద్యోగులే మోకాలడ్డుతున్నారన్న ఆరోపణలున్నాయి.

పూర్వ డీపీవో నాగరాజు అక్రమాలపై ఆరా

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు పారదర్శకం అంటూనే నిబంధనలు తుంగలో తొక్కారు. వైకాపాతో అంటకాగిన అధికారులను అందలమెక్కించారు. నిబంధనలు పాటించిన అధికారులను అడ్డదిడ్డంగా బదిలీలు చేశారు. అనంతపురం డీపీవోగా వారం రోజుల కిందట బాధ్యతలు చేపట్టిన టి.నాగరాజు నాయుడుపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఎంపీడీవోగా పని చేసిన నాగరాజునాయుడు గత ప్రభుత్వ పెద్దలతో అంటకాగడంతో కర్నూలు డీపీవోగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. మళ్లీ డీఎల్‌డీవోగా పదోన్నతి రావడంతో డీపీవోగానే కొనసాగారు. ఇటీవల కర్నూలులో జరిగిన కింది స్థాయి ఉద్యోగుల బదిలీల్లో భారీగా అక్రమాలు వెలుగుచూశాయి. డీపీవో, డీఎల్‌పీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న ఎనిమిది మంది జూనియర్ సహాయకుల బదిలీల్లో నిబంధనలు పాటించలేదు. బదిలీల పేరుతో వారికి పనిచేస్తున్న చోటే డిప్యుటేషన్లు ఇచ్చిన విషయంపై ఆరా తీశారు. వైకాపా హయాంలో ఆయన సిబ్బందితో వెట్టిచాకిరి చేయించుకున్న విషయాలపైనా ఆరా తీశారు. కర్నూలు కలెక్టర్ ఉత్తర్వులనూ తప్పుదోవ పట్టించి బదిలీలు ఇష్టారాజ్యంగా చేసినట్లు వెల్లడైంది. కర్నూలు జిల్లాలోని గ్రామ పంచాయతీలను అక్రమాలకు చిరునామాగా మార్చిన ఆయన్ను మళ్లీ అనంతపురం డీపీవోగా బదిలీ చేశారు. డీఎల్‌డీవోలు, ఎంపీడీవోలకు డీపీవో, డీఎల్‌పీవోలుగా నియమించకూడదని గతంలో హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. పంచాయతీరాజ్ అధికారులు ఈ ఉత్తర్వులను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదోనన్న చర్చకు దారి తీస్తోంది. మరోసారి హైకోర్టును ఆశ్రయించాలని కొందరు డీపీవోలు సిద్ధమయ్యారు.

గౌరవర్ణ స్వరూపిణి పరమేశ్వర హృదయ నివాసిని



శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: అష్టాదశ శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు నేత్రశోభితంగా జరుగుతున్నాయి. గురువారం భ్రమరాంబాదేవి మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక వేదికపై తేజోమయరూపంలో మహాగౌరి కొలువుదీరారు. చతుర్భుజ స్వరూపిణిగా సాక్షాత్కరించారు. కుడి చేత త్రిశూలాన్ని, ఎడమ చేతిలో ఢమరుకాన్ని ధరించి, అభయహస్తదీవెనలతో ఆశీనులై పూజలందుకున్నారు. నందివాహనంపై పార్వతీపరమేశ్వరులు ఆశీనులయ్యారు. కళాకారుల నృత్యాలు అలరించాయి.

← నందివాహనంపై కొలువైన స్వామి అమ్మవారు





భ్రమరాంబకు నేడు పట్టువస్త్రాలు

దసరా మహోత్సవాల తొమ్మిదో రోజు శుక్రవారం రాత్రి 7 గంటలకు భ్రమరాంబ మల్లికార్జునస్వామికు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. సిద్ధిదాయిని అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

బన్ని ఉత్సవాలకు ఏర్పాట్లు

హొళగుంద, న్యూస్‌టుడే: దసరా బన్ని ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. దేవరగట్టును గురువారం సందర్శించి, బన్ని ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్కింగ్, విద్యుత్తు వ్యవస్థ, నీటి వసతి, సీసీ కెమెరాలు, ఆసుపత్రి ఏర్పాటు తదితర సౌకర్యాలను పరిశీలించారు. గ్రామాల ప్రజలు కలిసి మెలిసి శాంతియుతంగా పండగ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సిఐ శ్రీనివాస నాయక్, హొళగుంద తహసీల్దారు ప్రసాద రాజు, హొళగుంద ఎస్సై బాల నరసింహులు, పోలీసులు, అన్ని శాఖల సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొంటారా.. కాదుపొమ్మంటారా

■ నేటికీ ఊసేలేని సీసీఐ కేంద్రాలు

■ దిగజారుతున్న పత్తి ధర



ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: తెల్ల బంగారం(పత్తి) ధరలు నేలచూపులు చూస్తుండటంతో కర్షకుల్లో కలవరం మొదలైంది.. ఇప్పుడైనా భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు చేస్తుందా ? కాదు పొమ్మంటుందా ? అన్నది సందిగ్ధంగా మారింది. మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధరే అధికంగా ఉందనే సాకుతో సీసీఐ గత మూడేళ్లుగా పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదు. జిల్లాలో రెండు లక్షల హెక్టార్ల పత్తి సాగు చేపట్టారు. ఈసారి ఒక్క ఆదోని మార్కెట్‌కే నాలుగు లక్షల పత్తి బేళ్లు వస్తాయని అంచనా. ప్రస్తుతం పత్తి ధరలు నేల చూపు చూస్తున్నాయి. నెల కిందటి వరకు క్వింటా రూ.8,260 పలికింది. ప్రస్తుతం రూ.7600-7690కు దిగజారింది. క్వింటాలుపై సరాసరి రూ.500-700 తగ్గుముఖం పట్టడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో నాలుగు కేంద్రాలు మంజూరు చేసినట్లు సీసీఐ అధికారులు ప్రకటించారు.. గతంలో మాదిరి ఆరంభశూరత్వంగా చేయొద్దని అన్నదాతలు విన్నవిస్తున్నారు.

కొరవడిన ప్రచారం

● మార్కెట్లో రైతులు పత్తిని బోరాల్లో తెస్తారు. బోరా తూకం కింద నాలుగైదు కిలోలు తీసేసి, బోరా ధర కింద రైతుకు రూ.20 చెల్లిస్తారు. కిల్లో పత్తి రూ.60 లెక్కించినా.. ఖాళీ బోరా రూ.50 ఈ లెక్కన నాలుగు కిలోల పత్తి, బోరాకు కలిపి మొత్తం రూ.300 అవుతుంది. వ్యాపారి ఇచ్చేది రూ.20, అంటే ఈ లెక్కన ఒక్కో బోరాపై రైతు సరాసరి రూ.280 వరకు నష్టపోతున్నారు. హమాలీ ఛార్జీలు, నగదు చెల్లింపులో కమీషన్‌తో పాటు వడ్డీ కత్తిరింపులు ఉంటాయి.

● సీసీఐకి పత్తి అమ్మితే తూకాల్లో కోతలుండవు, కమీషన్, వడ్డీ చెల్లింపుల బాధ ఉండదు. పారదర్శకంగా రైతు బ్యాంకు ఖాతాలో నగదు జమవుతుంది. వీటిపై గ్రామాల్లో ప్రచారం చేయాల్సిన యంత్రాంగం నిద్రపోతోంది.

సీసీఐ కేంద్రాల ప్రతిపాదన

★ ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడు

మద్దతు ధర(క్వింటా)

★ పొడుగు పింజ: రూ.7,521,

★ పొట్టి పింజ: రూ.7,121

కేంద్రం	2019-20	2020-21	2021-22	2022-23	2023-24
ఆదోని	71544	109735	0	0	0
ఎమ్మిగనూరు	92238.91	97204.35	0	0	0
కోడుమూరు	0	109174.60	0	0	7320.90

ఐదేళ్లలో సీసీఐ పత్తి కొనుగోలు ఇలా.. (క్వింటాళ్లలో)

వ్యాపారులకే మద్దతు

● మెరుగైన ధరలతో మార్కెట్‌లోకి వస్తున్నట్లు సీసీఐ చెప్పినా.. ప్రచారంలో వెనుకబడే ఉంది. ఇప్పటికే ధరలు పడిపోయాయి. పోటీ ధరతో మార్కెట్లోకి వస్తే వ్యాపారుల మధ్య పోటీ పెరిగి రైతులకు ప్రయోజనం దక్కే అవకాశం ఉంది.

● జిల్లా కేంద్రం నుంచి ఎలాంటి కదలిక లేదు. ఈసారి మార్కెట్ యార్డు కేంద్రాలు కాకుండా పరిశ్రమల కేంద్రాలుగా కొనుగోలుకు అవకాశం ఉండటంతో వ్యాపారులకు లాభం చేకురుస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

● మూడేళ్లుగా సీసీఐ గింజ పత్తిని కొనుగోలు చేయలేదు. రెండేళ్ల కిందట పత్తి కొరత పేరుతో వ్యాపారుల నుంచి 3,500 పత్తి బేళ్లను బేల్ ధర రూ.58వేల నుంచి రూ.63వేల వరకు చెల్లించి కొనుగోలు చేసింది. వ్యాపారులకు మేలు జరిగిందే తప్ప రైతులకు సీసీఐ నుంచి ఎలాంటి ప్రయోజనం కలగ లేదు.

అమ్మా.. నాకు ఊపిరిపోసి.. నీవు ఉసురెందుకు తీసుకున్నావు



రోదిస్తున్న భర్త నరసింహులు



గీత (పాత చిత్రం)

అమ్మా.. తొమ్మిది నెలలు ఎన్నో కష్టాలకోర్చి నాకు ఊపిరి పోశావు. నువ్వు, నాన్న సంతోషానికి గుర్తుగా నన్ను ఈ భూమ్మీదికు తెచ్చావు. ఐదు నెలలు నీ ఒడిలో ఆడాను. ఎంత ఏడ్చినా ఓపిగ్గా ఓదార్చావు. నిద్రలో ఉలిక్కిపడితే.. అక్కున చేర్చుకుని ధైర్యం చెప్పావు. నాకు ఆకలేస్తే.. నీ పేగులు కలవరపడేవి. నువ్వు రెప్పవాల్చకుండా.. నన్ను నిద్రపుచ్చేదానివి. నిద్రలేవగానే దేవుడి వైపు కాకుండా..నా మొఖం చూసేదానివి. పొత్తిళ్లలో ఉన్న నన్ను విడిచి ఎలా వెళ్లాలనిపించిందమ్మా. ఎన్నో నొప్పులు భరించిన నీకు.. కడుపు నొప్పి ఓ లేక్కా చెప్పు. ఐదు నెలలకే అమ్మలేని బిడ్డను చేసి, నాన్న చేతుల్లో పెట్టావు. నేను అమ్మా అని ఎవరిని పిలవాలి ? – న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు

కుమార్తెకు జన్మనిచ్చి ఐదు నెలలు గడవక ముందే ఓ బాలింత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదోని మండలం కడితోట గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన గీత(22)ను మంత్రాలయానికి చెందిన నరసింహులుకు ఇచ్చి ఏడాదిన్నర కిందట వివాహం చేశారు. గీత గర్భిణి కావడంతో కాన్పు కోసం పుట్టినిల్లైన కడితోట గ్రామానికి వచ్చారు. ఐదు నెలల కిందట పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ప్రసవం జరిగినప్పటి నుంచి గీతకు కడుపునొప్పి అధికంగా ఉండేదని, వైద్యులకు చూపినా తగ్గలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం నొప్పి అధికం కావడంతో భరించలేక.. ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పోలీసులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య మృతితో భర్త, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లి మృత్యువాత పడడంతో ఐదు నెలల చిన్నారి తల్లిప్రేమకు దూరమైంది.

ఆర్‌యూలో స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డీన్ నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 14, 15 తేదీల్లో ఆర్‌యూలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనాలన్నారు.

టెట్‌కు 263 మంది గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: టెట్ పరీక్షకు 263 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు ఇన్‌ఛార్జి డీఈవో శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సెషన్‌కు 1,276 మందికిగాను 1,156 మంది, మధ్యాహ్న సెషన్‌లో 1,515 మందికిగాను 1,372 మంది పరీక్ష రాసినట్లు ఆయన పేర్కొన్నారు.

పొరుగోళ్లు పోటీ పడుతున్నారు

■ మద్యం దుకాణాల నిర్వహణకు ఆసక్తి ■ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలవారు దరఖాస్తులు



కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణ అనుమతులకు పొరుగు రాష్ట్రాల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పలువురు రాజకీయ నాయకులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో వచ్చి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసులకు కర్నూలుతో అనుబంధం ఎక్కువ. గద్వాల, వనపర్తి జిల్లా వాసులు నిత్యం వేల మంది కర్నూలుకు వస్తుంటారు. ఆ రెండు జిల్లాలకు చెందిన కొందరు కర్నూలులో మకాం వేసి మద్యం దుకాణ అనుమతులు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా

గత వైకాపా పాలనలో నాసిరకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయించారు. మందుబాబులు ఆ మద్యాన్ని తాగలేక పొరుగు రాష్ట్రాలకు వెళ్లేవారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి జిల్లాకు నిత్యం పెద్దఎత్తున అక్రమ మద్యం రవాణా అయ్యేది. ప్రభుత్వం మారడం.. కొత్త మద్యం విధానం తీసుకొచ్చింది. పలు బ్రాండ్ల ధరలు ఆయా రాష్ట్రాలకన్నా తక్కువకే విక్రయించనున్నారు. ఈమేరకు ఆయా రాష్ట్రాల వ్యాపారులు ఏపీ మద్యం దుకాణ అనుమతుల కోసం వెంపర్లాడుతున్నారు.

మూడు వందల దరఖాస్తులు వారివే

కర్నూలు స్టేషన్ పరిధిలో మొత్తం 31 దుకాణాలు (కర్నూలు నగరంలో 20) ఉండగా గురువారం సాయంత్రానికి మొత్తం 1,154 మంది దరఖాస్తులు నమోదయ్యాయి. ఇందులో కర్నూలు దుకాణాలకు దాదాపు 300 మందిపైగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తులు దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలులో ప్రతి దుకాణానికి 30 నుంచి 50 వరకు దరఖాస్తులు రావడం గమనార్హం. ఓ దుకాణానికి అత్యధికంగా 50 నమోదయ్యాయి. మరో 20 దరఖాస్తులు పడొచ్చని భావిస్తున్నారు. ఆదోని, ఆలూరు స్టేషన్ పరిధిలోని దుకాణాలకు కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, రాయిచూర్ జిల్లా వాసులు దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమైన నాయకులు, వ్యాపారులు బినామీలతో వేయించారు.

నేడు దరఖాస్తుకు ఆఖరి రోజు

జిల్లాలో 99 మద్యం దుకాణ అనుమతులకు గురువారం సాయంత్రానికి 2,462 దరఖాస్తులు వచ్చాయి. స్టేషన్ల వారీగా పరిశీలిస్తే.. కర్నూలు 1,154, కోడుమూరు 400, ఆదోని 215, ఆలూరు 167, ఎమ్మిగనూరు 243, కోసిగి 40, పత్తికొండ 243 దరఖాస్తులు నమోదయ్యాయి. ఈ లెక్కన ప్రతి దుకాణానికి 24 వచ్చాయి. శుక్రవారం చివరి రోజున నవమి మంచిరోజు కావడంతో అత్యధికంగా దరఖాస్తులు పడతాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నెల 14న లక్కీడిప్ నిర్వహించనున్నారు.

లోపలి పేజీల్లో

పొరుగు రాష్ట్రంలో కొలువు పట్టారు 4

పచ్చని తీరం

☛ తుంగభద్ర ఒడ్డున పెరిగిన సాగు

☛ నదిలో సమృద్ధిగా నీటి ప్రవాహం



నదీతీరంలో సాగు చేసిన వరి

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: రెండేళ్ల తర్వాత తుంగభద్ర తీరం ‘పచ్చ’బడింది. గత రెండేళ్ల నుంచి సరైన వర్షాలు లేవు. నదిలో జల పరవళ్లు లేక పొలాలు బీడుగా మారాయి. ఉన్న కొద్దిపాటి నీటితో ఆరుతడి పంటలు సాగు చేసి కాలం వెళ్లదీశారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడం, ఆశించిన దాని కన్న ముందే తుంగభద్ర జలాశయం నిండిపోవడంతో దిగువకు నీరు సమృద్ధిగా ప్రవహిస్తోంది. జూన్ నుంచి ఇప్పటి వరకు నదిలో సుమారు 50 టీఎంసీలకుపైగా నీరు దిగువకు ప్రవహించింది. గతేడాది వర్షాలు అరకొరగా ఉండటంతో ఇదే సమయానికి నదిలో ఒక టీఎంసీ నీరు ప్రవహించని పరిస్థితి. ఈ ఏడాది నదిలో నీటి ప్రవాహంతో రైతులు ఆశాజనకంగా సాగు చేపట్టారు.

మండలం	గతేడాది సాగు (ఎకరాల్లో)	ఈ ఏడాది సాగు (ఎకరాల్లో)
కౌతాళం	3,876	4,093
కోసిగి	960	1,031
మంత్రాలయం	795	800
నందవరం	4,000	5,200



నిండుగా ప్రవహిస్తున్న తుంగభద్ర

నదీతీరంలో ఉండే మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో మొత్తం కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం మండలాల్లో కలిపి ఈ ఏడాది 11,124 ఎకరాల్లో వరి సాగు చేశారు.

తీరిన కలవరింత

- రేణప్ప గుడికంబాలి

నాకు నాలుగెకరాల పొలం ఉంది. గతేడాది నదిలో నీరు ప్రవహిస్తుందన్న నమ్మకంతో ఎకరానికి రూ.20 వేల ఖర్చుతో వరి సాగు చేశా. ఆ తర్వాత నదిలో నీటి ప్రవాహం లేకపోవడంతో [illegible]. దీంతో నదిలో చెలిమలు తవ్వి ఆ నీటితో రెండెకరాలకు పారించా. మిగిలిన రెండెకరాలను వదిలేశాను. దీంతో సుమారు రూ.80 వేలు నష్టపోయా. ఈ ఏడాది నీరు సమృద్ధిగా ప్రవహిస్తుండటంతో నాలుగెకరాల్లో వరి సాగు చేశా.

గృహ నిర్మాణ సహకార సొసైటీలో అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నాలుగో తరగతి ఉద్యోగుల గృహ నిర్మాణ సహకార సొసైటీలో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసిన ప్లాట్లను రద్దు చేసి అర్హులైన ఉద్యోగులకు కేటాయించాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండు చేశారు. చిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని, బాధ్యులైన మాజీ అధ్యక్షుడు, సహకార అధికారి తదితరులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గురువారం నగరంలోని ఎస్టీయూ భవన్‌లో ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు బాధితుల పక్షాన నిలిచి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అర్హులైన ఉద్యోగులకు ప్లాట్లు కేటాయించేందుకు నాలుగో తరగతి ఉద్యోగ ఇంటి స్థల పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అధ్యక్షునిగా జట్టి కృష్ణ, సభ్యులుగా కుమారస్వామి, ఎం. రామకృష్ణారెడ్డి, నాగన్నతోపాటు మరికొంతమందిని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి అనుబంధంగా లీగల్ సెల్ కమిటీని కూడా ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షులు ఓపీడీఆర్ సంస్థ నుంచి కడుకాకర్, న్యాయవాది నిరంజన్, ఆర్. నరసింహులును నియమించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకుడు గౌస్ దేశాయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖాజాహుసేన్, బజారన్న, బీఎస్పీ సురేష్ బాబు, సీపీఐ నాయకులు రామకృష్ణారెడ్డి, వైకాపా నుంచి షరీఫ్, తెదేపా జనసేన, భాజపా నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఎం. రామకృష్ణారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు మనోహర్ మాణిక్యం, బీసీ సంఘం నాయకులు శేషఫణి, రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ నాయకులు రవికుమార్, ముస్లిం నాయకులు చాంద్ బాషా, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, ఐఎన్టీయూసీ నాయకులు బతుకన్న, డీటీఎఫ్ నాయకులు రత్నం ఏసేపు పాల్గొన్నారు.

ఈనాడు కథనంపై పోలీసుల స్పందన

ఈ నెల 9న ఈనాడులో ప్రచురితమైన అక్రమ పునాదులు.. 509 ప్లాట్లు శీర్షికతో ఈనాడులో వచ్చిన కథనం ప్రతులను రౌండ్ టేబుల్ సమావేశంలో పంపిణీ చేశారు. ఈ కథనంపై పోలీసు యంత్రాంగం స్పందించింది. నాలుగో తరగతి ఉద్యోగుల గృహ నిర్మాణ సహకార సొసైటీ మాజీ అధ్యక్షుడు బాల నరసింహులు, గోపాల కృష్ణ, నాగరాజు తదితరులను మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు రప్పించి, అనేక ఫిర్యాదులు వస్తున్నాయని సీఐ హెచ్చరిక చేసినట్లు సమాచారం.

ఏఆర్ అదనపు ఎస్పీ, డీఎస్పీలకు పదోన్నతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు శాఖ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి చెందిన అదనపు ఎస్పీ జి. నాగబాబుకు అటాచ్‌మెంట్‌పై ఇంటెలిజెన్స్ విభాగంలో పని చేస్తున్నారు. ఈయనకు ఎస్పీగా పదోన్నతి కల్పించి ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగానికి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా హోం గార్డు డీఎస్పీ కృష్ణ మోహన్‌కు అదనపు ఎస్పీగా పదోన్నతి కల్పించి ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగానికి నియమిస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వు జారీ చేసింది.

మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజులపాటు సెలవులు వచ్చాయి. 11న శుక్రవారం దుర్గాష్టమి, 12న శనివారం విజయదశమి, 13న ఆదివారం సాధారణ సెలవు. ఈ నెల 14న సోమవారం మార్కెట్ యార్డులో యథావిధిగా క్రయవిక్రయాలు జరగనున్నాయని మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్. జయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముడుపులిస్తేనే మ్యుటేషన్ల వ్యవహారంపై విచారణ

స్పందనకు వందనం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు అర్బన్ మండలంలో ముడుపులిస్తేనే మ్యుటేషన్లు.. కీలక పాత్ర పోషిస్తున్న ఓ వీఆర్వో.. నిషేధిత జాబితాలో పెట్టినా.. శీర్షికతో ఈ నెల 8న ఈనాడులో వచ్చిన కథనానికి కలెక్టర్ పి. రంజిత్ బాషా స్పందించారు. కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)ను విచారణకు ఆదేశించారు. కర్నూలు అర్బన్ మండలంలో మ్యుటేషన్లకు ముడుపులు, నిషేధిత జాబితాలో భూములను మ్యుటేషన్లు చేసిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నివేదికలను సమర్పించాలని ఆర్డీవోను ఆదేశించారు.

నూలుపై 15 శాతం రాయితీ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: చేనేత సహకార సంఘాలు, నేత కార్మికులు స్వయం సహాయ సహాయక సంఘాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నూలుపై 15 శాతం రాయితీ అందిస్తున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా చేనేత జౌళీ శాఖ ఏడీ నాగరాజరావు తెలిపారు. అర్హులు, ఆసక్తిగలవారు వినియోగించుకోవాలని కోరారు.

పొరుగు రాష్ట్రంలో కొలువు పట్టారు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కృషి పట్టుదల ఉంటే ఎక్కడైనా విజయాన్ని సాధించవచ్చు. వైకాపా ఐదేళ్ల పాలనలో డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగ ప్రకటన కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూశారు. ఏళ్లు గడిచినా ఉద్యోగ ప్రకటన విడుదల కాకపోవడంతో తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు మాత్రం కొద్దిపాటి పోస్టులకు ప్రకటనలు ఇచ్చి మమ అనిపించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలోనూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఆంధ్రా కన్నా ముందుగానే పరీక్షలు నిర్వహించారు. ఓపెన్ కేటగిరిలో తమ భవితవ్యాన్ని పరీక్షించుకునేందుకు ఆత్మకూరుకి చెందిన ముగ్గురు విద్యార్థులు పరీక్షలు రాసి విజయం సాధించారు. ఆ విద్యార్థుల విజయ ప్రస్థానంపై న్యూస్‌టుడే కథనం

వయస్సు తక్కువగా ఉండటంతో పోస్టు పోయింది



మాది కురుకుంద గ్రామం. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడే నాన్న చనిపోయారు. అమ్మ కూలి పనులు చేసుకుంటూ ఎంతో కష్టపడి నన్ను చదివించింది. 2018లో ఆంధ్రాలో డీఎస్సీ రాశాను. 70.8 కటాఫ్ మార్కులు ఐదుగురికి రాగా నలుగురికి పోస్టులు వచ్చాయి. నాలుగు, ఐదు స్థానాల్లో ఇద్దరం పోటీ పడ్డాము. నా వయస్సు తక్కువగా ఉండటంతో పోస్టు పోయింది. స్థానిక ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ ఓ స్టడి సర్కిల్‌లో ఐదేళ్లుగా శిక్షణ తీసుకున్నాను. పాఠశాలలో నాకు బోధించే ఉపాధ్యాయులను చూసి నేను చిన్నప్పుడే టీచర్ కావాలని నిర్ణయించుకున్నాను. హైద్రాబాద్ జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 80 పోస్టులుండగా నాన్ లోకల్‌కి 4 పోస్టులున్నాయి. జిల్లాలో మూడో ర్యాంకు వచ్చినప్పటికి ఓపెన్ కేటగిరి నాన్ లోకల్‌లో నేను మొదటి స్థానంలో నిలిచినందుకు చాలా సంతోషంగా ఉంది.

– ఎస్‌హెచ్ గౌసియ కురుకుంద

చిన్నప్పుడే నిర్ణయించుకొన్నాను



మాది నిరుపేద కుటుంబం. నాన్న గోనె సంచుల వ్యాపారం చేస్తారు. జగిత్యాల జిల్లాలో ఉర్దూ ఎస్జీటీలో మూడో ర్యాంక్ సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఓపెన్ కేటగిరిలో 6 పోస్టులుండగా అందులో నాన్ లోకల్‌కి ఒక పోస్టు ఉంది. పాఠశాల స్థాయిలోనే మా ఉపాధ్యాయులు నన్ను ఎంతగానో ప్రోత్సహించేవారు. అప్పటి నుంచే నేను టీచర్ కావాలని నిర్ణయించుకున్నాను. ఆంధ్రా డీఎస్సీకి ప్రాక్టీస్‌గా ఉంటుందని తెలంగాణ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. నాన్ లోకల్‌లో ఉద్యోగం సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది.

– మైమూన్ ఆత్మకూరు



ఉర్దూ ఉపాధ్యాయునిగా సేవా చేయాలని..

మాది ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామం. నాన్న కార్పెంటర్‌గా పనిచేస్తున్నారు. మాది నిరుపేద కుటుంబం. 2012లో గ్రామంలో ఉర్దూ ఉన్నత పాఠశాల ఏర్పాటైంది. అప్పటి నుంచి 2022 వరకు ఈ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయుల్లేరు. 2022లో ఉర్దూ మాధ్యమం తీసేశారు. తెలుగు మాధ్యమం విద్యార్థులతో పోటీ పడి చదివాము. అప్పటి నుంచి ఉర్దూ మాధ్యమంలో ఉపాధ్యాయునిగా సేవా చేయాలని నిశ్చయించుకున్నాను. నిజామాబాద్ జిల్లాలో ఓపెన్ కేటగిరిలో 22 పోస్టులు ఉండగా అందులో నాన్ లోకల్ పోస్టు ఒక్కటే ఉంది. ఉర్దూ ఎస్జీటీ విభాగంలో జిల్లా మొదటి ర్యాంక్ సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. అక్కడ విధులు నిర్వహిస్తూనే ఆంధ్రా డీఎస్సీకి పోటీ పడుతాను.

– బషిరూన్

పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టాలి..



ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవిస్తున్న బిర్రు ప్రతాపరెడ్డి

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: సచివాలయ వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత పంచాయతీ వ్యవస్థ గాడితప్పిందని, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సి ఉందని పంచాయతీరాజ్ ఛాంబరు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి కోరారు. గురువారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందించినటుల పేర్కొన్నారు. వైకాపా పాలనలో పంచాయతీ నిధులను పక్కదారి పట్టించడంతోపాటు పంచాయతీ ఖాతాల్లో చిల్లి గవ్వ లేకుండా చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పంచాయతీ ఖాతాలు నిధులతో కళకళలాడుతున్నాయని తెలిపారు. ఉపాధి నిధుల ద్వారా పల్లెల్లో రహదారుల బాగుకు నిధులు కేటాయించడం అభినందనీయమని, ఏళ్ల తరబడి రహదారి వసతి లేక పల్లెవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

ఉపాధి నిధులతో పల్లె రహదారులు

☛ 798 రహదారులకు రూ.52.26 కోట్లు



పీఆర్ ఇంజినీర్లతో చర్చిస్తున్న ఎస్ఈ రామచంద్రారెడ్డి

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ఉపాధి నిధుల ద్వారా గ్రామీణ రహదారుల రూపురేఖలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ కర్నూలు ఎస్ఈ వి. రామచంద్రారెడ్డి ఆదేశించారు. కర్నూలు జిల్లాలో రూ.52.26 కోట్ల ఉపాధి నిధులతో 80 కి.మీ. విస్తీర్ణంలో 798 రహదారులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన ఇంజినీర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూడు నెలల వ్యవధిలో గ్రామీణ రహదారులు నిర్మాణం పూర్తి, నాణ్యత తదితర అంశాలపై కర్నూలు ఈఈ మద్దన్నతో చర్చించారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి కనీసం 56 కి.మీ. రహదారులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ నాటికి పనులు పూర్తి చేసి మరోసారి పల్లె పండగలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి హామీల ప్రతిపాదనలు

ఈ నెల 1న ముఖ్యమంత్రి చంద్రబాబు పుచ్చకాయలమడ గ్రామంలో పర్యటించినప్పుడు వచ్చిన హామీలు, వాటి ప్రతిపాదనలు, నిధులు తదితర అంశాలపై చర్చించారు. ఆ గ్రామంలో 5 పనులకు రూ.13.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఈఈ మద్దన్న తెలిపారు. పుచ్చకాయలమడ నుంచి పెరవళి గ్రామానికి 7 కి.మీ.కు రూ.5.60 కోట్లతో బీటీ రహదారి, పుచ్చకాయలమడ నుంచి రామచంద్రాపురం గ్రామానికి 5 కి.మీ. బీటీ రహదారికి రూ.4 కోట్లు, పుచ్చకాయలమడ నుంచి హోసూరు వరకు 3 కి.మీ. బీటీ దారికి రూ.2.40 కోట్లు, గ్రామంలో శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణానికి రూ.60 లక్షలు, గ్రామంలో దర్గాకు ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు, వెటర్నరీ లైవ్‌స్టాక్ నూతన కేంద్రానికి రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని ఈఈ తెలిపారు. అదే విధంగా పుచ్చకాయలమడలో రూ.158 లక్షలతో పనులు కొనసాగుతున్నాయని, రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధులు విడుదల కావాల్సి ఉందని ఈఈ వివరించారు. జిల్లాలో కనీస రహదారి వసతుల్లేని గ్రామాలను గుర్తించడం ద్వారా 25 గ్రామాలకు రూ.13.50 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. సమావేశంలో ఎస్ఈ పీఏ (డీఈఈ) శ్రీనివాసులు, పత్తికొండ డీఈఈ శేషయ్య పాల్గొన్నారు.

పరివాహన్.. పరేషాన్

☛ యాప్‌పై అవగాహన కల్పించడంలో విఫలం

☛ నిరక్షరాస్యులంతా లైసెన్సు పత్రాలకు మీసేవ కేంద్రాలకు పరుగులు



జిల్లా రవాణా కార్యాలయం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లా వాహనదారులు వాహన పత్రాల కోసం ఎదురుచూడక తప్పడం లేదు. వాహనదారులకు నూతన యాప్‌పై అవగాహన కల్పించడంలో రవాణా శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. కాగిత రహిత (పేపర్ లెస్) సేవలకు ప్రాధాన్యం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం రవాణా శాఖకు సంబంధించిన వ్యవహారాలన్నీ ‘పరివాహన్’ యాప్‌లోకి తెచ్చింది. వాహన పత్రాల కోసం ప్రైవేట్ వ్యక్తులు నిర్వహించే కేంద్రాల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పరివాహన్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. తనిఖీల సమయంలో పోలీసులకు పత్రాలు చూపించాల్సి రావడంతో ఉచితంగా ఇవ్వాల్సిన పత్రాలు డబ్బులు పెట్టి తీసుకోవాల్సి రావడం గమనార్హం. కాగిత రహిత పత్రాలు తీసుకు రావడమే లక్ష్యంగా 2019లో కేంద్ర రవాణా శాఖ పరివాహన్ యాప్, వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ వెబ్‌సైట్‌లో రవాణా శాఖకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, లెర్నింగ్, రిజిస్ట్రేషన్, చిరునామా మార్పు వంటి సుమారు 16 రకాల సేవలు ఉంచారు. వాహనదారుడు రవాణా శాఖకు చెందిన రుసుము ఇందులో చెల్లించాలి. ఆ తర్వాత అభ్యర్థి దరఖాస్తు వాహన యాప్ నుంచి ప్రింట్ తీసుకుని పరీక్ష దగ్గర నుంచి రిజిస్ట్రేషన్ వరకు రవాణా కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. రవాణా కార్యాలయంలో పత్రాలు చూపించిన తర్వాత పరిశీలన కోసం చరవాణి నంబరుకు వచ్చే ఓటీపీ ద్వారా అధికారులు ధ్రువీకరించి తదుపరి పనులు ప్రారంభిస్తారు. వాహన లైసెన్సు నుంచి రిజిస్ట్రేషన్ పత్రాలకు చెల్లించే వాటిలో పత్రాల రుసుము కూడా వాహనదారులు చెల్లిస్తారు కాబట్టి, రవాణా శాఖ ఉచితంగా పత్రాలను ప్రింట్ చేసి ఇవ్వాలి. కాగితాలు లేని కారణంగా రవాణా శాఖ అధికారులు మళ్లీ మీసేవా కేంద్రాలకు పంపుతున్నారు.

వాహనదారుల నుంచి వసూలు

రవాణా శాఖలో లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్సు పాసైన తర్వాత చరవాణికి మెసేజ్ రావడంతో మీసేవా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన లెర్నింగ్ లైసెన్సు జిరాక్సు కాగితాన్ని కేంద్రాల నిర్వాహకులు రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. అదే లైసెన్సు అయితే డౌన్‌లోడ్ చేసినందుకుగాను రూ.20, కార్డు రూపంలో ప్రింట్ కావాలంటే మరో రూ.100 వస్తూలు చేస్తున్నారు. యాప్‌లో వెళ్లాలంటే www.parivahan.nic.govt.inలో లాగిన్ కావాలి. సీనియర్ సిటిజన్‌లోని వెళ్తే సంబంధిత సేవలుంటాయి. అక్కడే రుసుము చెల్లించాలి.

అధిక భాగం నిరక్షరాస్యులే..

టూ వీలర్, ఫోర్ వీలర్‌కు వచ్చే వాహనదారుల నుంచి ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ ఆటో, హెవీ వాహన డ్రైవింగ్‌కు వచ్చే వారిలో అధిక భాగం నిరక్షరాస్యులే ఉంటున్నారు. ప్రతి రోజూ వాహనాల డ్రైవింగ్ లైసెన్సు కోసం వచ్చేవారు 50 మంది వరకు ఉంటే.. అందులో ఆటోడ్రైవర్లు 10, లారీ డ్రైవర్లు 15, మెకానికులు 10 మంది వరకు ఉండటం గమనార్హం. కేవలం 20 మంది మాత్రమే వాహన పత్రాలను డౌన్‌లోడ్ చేసుకునే అవగాహన ఉంటే.. మిగితావారు మీ సేవా కేంద్రాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రింట్ వచ్చేలా చేయాలి: రమేశ్, ఆటోడ్రైవర్

డ్రైవింగ్ లైసెన్సు కోసం రవాణా శాఖ కార్యాలయంలో పరీక్ష పూర్తయిన తర్వాత పాసైయ్యామని చెబుతున్నారు. మీసేవా కేంద్రాలకు వెళ్లి తీసుకోమని సిబ్బంది చెబుతున్నారు. డ్రైవింగ్ లైసెన్సును ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలో తెలియదు. వీటిపై రవాణా శాఖ అధికారులు కేంద్రం ఏర్పాటు చేసి వారే ప్రింట్ తీసి ఇస్తే బాగుంటుంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని దుర్మరణం



ఆంజనేయులు(పాత చిత్రం)

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన ఆదోని మండలం గోనబావి సమీపంలో గురువారం జరిగింది. తాలుకా ఎస్సై రామాంజనేయులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఆస్పరి గ్రామానికి చెందిన ఆంజనేయులు(45) గోనబావి సమీపంలోని పెట్రోలు బంకులో పనిచేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్య లలిత, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఐదు నెలలుగా ఆదోని పట్టణంలోని ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నారు. పెట్రోలు బంకులో పని చేస్తున్న ఆంజనేయులు టీ తాగేందుకు బంకు ఎదురుగా ఉన్న రహదారిపై వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం స్థానిక ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆంజనేయులు మృతి చెందారు. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయిన భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

గ్రేడ్-I వీఆర్వోలకు పదోన్నతులు

- సీనియారిటీ జాబితా పంపించాలని ఆదేశాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు సీనియారిటీ జాబితాను తయారు చేసి పంపాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా నంద్యాల జిల్లా కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలకు గురువారం ఉత్తర్వులు పంపారు. గ్రేడ్-1 వీఆర్వోలుగా పని చేస్తూ డిగ్రీ పాసైన (జినైనెస్ సర్టిఫికెట్లు పరిశీలించి), ఐదేళ్ల సర్వీసు పూర్తయినవారు, ఎలాంటి క్రమశిక్షణా చర్యలులేని గ్రేడ్-1 వీఆర్వోల సీనియారిటీ జాబితాను తయారు చేసి పంపాలన్నారు. సర్వీసు రిజిస్టర్లను పరిశీలించి నిర్దేశించిన ప్రొఫార్మాలో కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెంటనే పంపాలని ఉత్తర్వులు జారీ చేశారు.

వారం రోజుల్లో గ్రేడ్-2 వీఆర్వోలు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించేందుకు గ్రేడ్-2 వీఆర్వోల సీనియారిటీ జాబితాను పంపాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్, అన్ని రెవెన్యూ డివిజనల్ అధికారులకు, కర్నూలు మున్సిపల్ కమిషనర్, ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల కమిషనర్‌లకు గూడూరు నగర పంచాయతీ, ఉమ్మడి జిల్లాలోని అన్ని తహసీల్దార్లకు, ఎంపీడీవోలకు గురువారం ఉత్తర్వులు పంపారు. గ్రేడ్-2 వీఆర్వోలు ప్రస్తుతం పని చేస్తున్న స్థానం, రెండేళ్ల సర్వీసు పూర్తయినవారి వివరాలను, సర్వీసు రిజిస్టర్లను పరిశీలించి, నిర్దేశించిన ప్రొఫార్మాలో వారం రోజుల్లో తమకు నివేదించాలన్నారు.

నకిలీ ఆర్టీవో అధికారుల పైసా వసూల్

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: తాము ఆర్టీవో అధికారులమని చెబుతూ.. ఆదోని పట్టణంలో కొందరు వాహన చోదకుల నుంచి పైసా వసూల్‌కు పాల్పడిన ఘటన గురువారం వెలుగు చూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఆదోని పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు నకిలీ ఆర్టీవో అధికారుల అవతారమెత్తారు. పట్టణంలోని ఆకాశవంతెన సమీపంలో ఈ నెల 8వ తేదీన వాహనాలను ఆపుతూ పత్రాలు చూపాలని, సరిగా లేవని డబ్బులు వసూలు చేశారు. ఓ వాహనానికి పత్రాలు సరిగా లేవని, రూ.లక్ష ఇస్తే వదిలేస్తామని, లేదంటే సీజ్ చేస్తామని నకిలీ ఆర్టీవో అధికారులు ఓ వాహన యజమానిని బెదరించారు. అంతటితో ఆగక వాహన చోదకుడిపై చేయి చేసుకున్నట్లు సమాచారం. దీంతో బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన ఓ పోలీసు అధికారి సీసీ కెమెరాల సాయంతో నకిలీ ఆర్టీవో అధికారులు ఇద్దరిని అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు వ్యక్తులు ఆలూరు ప్రాంతంలోనూ వాహన చోదకుల నుంచి డబ్బు వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని సంబంధిత పోలీసు అధికారితో ‘న్యూస్‌టుడే’ ప్రస్తావించగా.. కేసు విచారిస్తున్నామని సమాధానం ఇచ్చారు.

గృహప్రవేశాలు చేయాలి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులో నిర్మించిన టిడ్కో గృహాల తాళాలు అందుకున్న లబ్ధిదారులు 12వ తేదీ లోపు గృహప్రవేశాలు చేసుకోవాలని పురపాలక కమిషనర్ కృష్ణ గురువారం తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాల మేరకు ముళ్ల చెట్లు తొలగించి, విద్యుత్తు, నీరు తదితర వసతి కల్పించామన్నారు. ఏదైనా ఇబ్బందులుంటే సమీప సచివాలయంలో ప్లానింగ్ కార్యదర్శులను సంప్రదించాలన్నారు. 300 చ.అడుగుల నివాసాలకు సంబంధించి ఏ 26, 27, 30, 31, 32, 34, 35 బ్లాక్‌లకు సంబంధించి తాళాలు అందజేశామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండగను కొత్త ఇళ్లలో జరుపుకోవాలన్నారు. అన్ని సౌకర్యాలు ఉండటంతో చేరేందుకు కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: ఆదోని మండలం గణేకల్లు గ్రామంలోని ప్రధాన రహదారిలోని విద్యుత్తు నియంత్రిక రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. - జీసీ బంగారయ్య, గణేకల్లు, ఆదోని

సమాధానం: గ్రామంలో పరిశీలించి తొలగించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తాం. - చెన్నయ్య, విద్యుత్తు శాఖ ఏఈ, ఆదోని

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 8008573822

చిప్పగిరి, న్యూస్‌టుడే: సమస్య: నంచర్లలో రహదారుల పైకి కొందరు మురుగు నీటిని వదులుతున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. మురుగు కాల్వ ఏర్పాటు చేయాలి. - రంగస్వామి, నంచర్ల

సమాధానం: ప్రతిపాదనలు పంపించాం. మురుగు రహదారిపైకి వదిలితే చర్యలు తీసుకుంటాం. - భీమ, సర్పంచి నంచర్ల

కొత్తపేట.. దాహమే పండగ పూట



హొళగుంద మండలం కొత్తపేట గ్రామస్థులకు పండగ పూట కూడా తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో సుమారు 120 కుటుంబాలు ఉన్నాయి. విరుపాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి నీరు సరఫరా చేయాలి. పైపులైన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో పక్కనే ఉన్న నెరణికి చెరువుకు మోటారు వేసి నీటి సరఫరా చేస్తున్నారు. తోపుడు బండ్లతో వెళ్లి ట్యాంకుల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. దేవరగట్టు ఉత్సవం, దసరా పండగ రోజు కూడా నీటి కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామ్‌నీలాతో ప్రస్తావించగా.. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నీటి సమస్యకు పరిష్కారం చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, హొళగుంద

పట్టణంలో పద్మవ్యూహం



దసరా పండగ రానే వచ్చింది. కొనుగోళ్లతో పట్టణాలు సందడిగా మారాయి. పల్లెలు పట్టణాలకు పోటెత్తాయి. కొత్త వస్త్రాలు, నిత్యావసర వస్తువులు, పండ్లు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఒక్కసారిగా ఆదోని మార్కెట్‌కు తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య ఒక్కసారిగా పెరిగిపోయింది. పట్టణంలోని ప్రధానమైన ఎంఎం రహదారి, పీఎన్ రహదారుల్లో వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయి. సుమారు రెండు గంటల పాటు రహదారిపై నే పడిగాపులు తప్పలేదు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు చర్చించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు

పల్లెల్లో శుభ్రత చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో శుభ్రత చర్యలు చేపట్టాలని, నీటి ట్యాంకులు శుభ్రం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, పత్తికొండ ఈవోఆర్డీ నరసింహులు అన్నారు. పత్తికొండలో డివిజన్ స్థాయి పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పల్లె పండగ కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కార్యక్రమంలో పత్తికొండ డివిజన్ పరిధిలోని 9 మండలాల పంచాయతీ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉద్యోగావకాశాలు



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అని ఎమ్మెల్సీ మధుసూదన్ అన్నారు. ఆదోని మండలం మండిగిరి పంచాయతీ పరిధిలోని ఫెయిత్ హోంలో గురువారం కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ డానియల్ ప్రేమ్‌కుమార్, దేవాదాసు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికే పార్టీలో గుర్తింపు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో నిస్వార్థంగా భాజపా కోసం పనిచేసే వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. పెద్దహరివాణం గ్రామం నుంచి వైకాపాకు చెందిన పలువురు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో భాజపాలో చేరారు. చేరిన వారిలో ఉరుకుంద, వీరేష్, మహాదేవ, ఆంజనేయ, అయ్యప్ప, చిన్నగాదిలింగా, ఉసేనప్ప, నాగరాజు, వీరేష్ తదితరులున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేంద్రకుమార్, నాగరాజుగౌడ్, మండల అధ్యక్షులు వేణుగోపాల్, రంగనాథ్‌రెడ్డి ఉన్నారు.

అడుగడుగునా గండమే



మద్దికెర- పత్తికొండ ప్రధాన రహదారిలో అడుగడుగునా మోకాలి లోతు గుంతలు వాహనదారులకు శాపంగా మారాయి. ఈ దారిలో నిత్యం ఎవరో ఒకరు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచాయి. మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించడం, అవినీతి అక్రమాలతో దారి చెదిరిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దారి మరమ్మతులు చేసి గండాలు తప్పించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మద్దికెర

బన్ని ఉత్సవం ప్రశాంతంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, ఆర్డీవో, డీఎస్పీ

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దేవరగట్టులో జరిగే బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకుందామని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. ఆలూరు మండలంలోని అరికెర గ్రామంలో దేవరగట్టు బన్ని ఉత్సవాలపై గ్రామస్థులతో గురువారం మాట్లాడారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా.. నాటి నుంచి వస్తున్న సంప్రదాయాన్ని పాటిద్దామన్నామరు. బన్ని ఉత్సవానికి రింగు కర్రలు, దివిటీలు వంటివి తీసుకురాకుండా పండుగను ప్రశాంతంగా చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, తహసీల్దారు గోవింద్ సింగ్, ఎస్సై వెంకట నరసింహులు, ఆర్ఐ బసవన్నగౌడ్, గ్రామ సర్పంచి నాగరాజు పాల్గొన్నారు.

తెర్నేకల్‌కు జిల్లా అధికారుల పరుగులు



కాలనీవాసులతో మాట్లాడుతున్న జోనల్, జిల్లా మలేరియా అధికారులు డాక్టర్ లక్ష్మీనారాయణ, నూకరాజు

తెర్నేకల్(దేవనకొండ) న్యూస్‌టుడే: తెర్నేకల్‌లో రోజూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, మురుగు నిల్వ లేకుండా చూడాలని జోనల్ మలేరియా నివారణ అధికారి, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, నూకరాజు సంబంధిత పంచాయతీ అధికారులను ఆదేశించారు. మండలంలోని తెర్నేకల్ గ్రామంలో గురువారం పర్యటించారు. డెంగీ కేసులు తరచూ రావడంతో దోమలు నిల్వ లేకుండా ఆయిల్‌బాల్స్ వేయాలని, పరిసర ప్రాంతాలలో అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. గ్రామంలో 15 రోజులకోసారి కాలనీల్లో ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో చంద్రశేఖర్, వైద్యులు అరుణజ్యోతి, వెంకటేశ్వర్లు, మలేరియా యూనిట్ అధికారి సాయిబాబా, రంగస్వామి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఎమ్‌ఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

వ్యాయామంతో గుండె పదిలం



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు విశ్వనాథ్

హొళగుంద, న్యూస్‌టుడే: రోజూ వ్యాయం, ఆహారపు అలవాట్లతో గుండె ఆరోగ్యం బాగుంటుందని మధు హాస్పిటల్ ఎండీ డాక్టర్ మనోజ్‌కుమార్ రెడ్డి, గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ విశ్వనాథ్ అన్నారు. స్థానిక కన్నడ ప్రాథమిక పాఠశాలలో ఎన్టీఆర్ సేవా సమితి వారి సహకారంతో గురువారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల వారికి పరీక్షలు చేసి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు శేషగిరి, తిప్పయ్య, మల్లికార్జున, అర్జున్, ఎన్టీఆర్ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

బంగ్లా కాలనీలో బండెడు కష్టాలు

☛ మౌలిక వసతులు కరవు ☛ కనిపించని సీసీ రహదారులు, కాల్వలు



మట్టిదారులే దిక్కు.. కనిపించని మురుగు కాల్వలు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని రాజాసాహెబ్ బంగ్లా కాలనీలో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచినా తాగు నీరు తప్ప ఎలాంటి సౌకర్యాలు లేవని ఆ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 25వ వార్డులో అంతర్భంగా ఉన్న కాలనీలో 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. నిరుపేద, మధ్య తరగతి వారే. కూలి పనులకు వెళ్తే కాని పూట గడవని పరిస్థితి. కాలనీ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో చిన్న పాటి వర్షానికే మునక తప్పడం లేదు. రోజుల తరబడి నీరు నిలుస్తుండటంతో అపరిశుభ్రంగా మారి దోమలు వ్యాపిస్తున్నాయి. బురద నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. రహదారుల నిర్మాణాలు చేపట్టాలని అనేక సార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఇంతవరకు ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఏలికలు స్పందించి సమస్యలు పరిష్కరించి, మౌలికసదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.



బోరు వేసి, మోటారు బిగించకుండా వదిలేశారిలా..

వర్షం వస్తే మునకే



మా కాలనీలో వర్షం వస్తే మునక తప్పడం లేదు. మోకాలి లోతులో నీటి ప్రవాహం ఉంటుంది. ఇళ్లలోకి నీరు చొచ్చుకొచ్చి సామగ్రిని నిండా తడిపేస్తున్నాయి. రోజుల తరబడి నీరు నిలిచి, పాచి పట్టి కంపు కొడతాయి. ఇళ్ల మధ్య అపరిశుభ్రతతో దుర్వాసన వస్తోంది. విష కీటకాలు సంచరిస్తున్నాయి. పిల్లలను బయటకు వదల్లేకపోతున్నాం. కంప చెట్లు పెరిగాయి. వాటిని తొలగించి, వసతులు కల్పించాలి. - మనోహర్, కాలనీవాసి

మట్టిదారులే దిక్కు



రాజాసాహెబ్ బంగ్లా ప్రాంతంలో రహదారులు నిర్మించాలి. కాలువలు నిర్మించి, దారులు వేయడం మరిచారు. బోరు వేసి, మోటారు బిగించలేదు. తెచ్చిన మినీ ట్యాంకు మురుగు నీటిలో పెట్టేశారు. ప్రస్తుతం బోరు యంత్రం పనిచేస్తుందో లేదో తెలియని పరిస్థితి. కాలనీ చివర్లోని ఇళ్ల వైపు వీధి దీపాలు బిగించాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. - మధు

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండలోని ఎఫ్ఆర్ ఉన్నత పాఠశాలలో 2010లో పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు 14 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. అందరూ పాఠశాలలో చిన్న పిల్లల్లా సందడి చేశారు. తమకు అక్షరాలను నేర్పిన బడిని అభివృద్ధి చేయాలని వారంతా సంకల్పించారు. అప్పటి ఉపాధ్యాయులు రఘునాథ్, ఉచ్చీరప్ప, సోమన్న, అంకమురావ్, పరమేశ్వరప్ప, దివ్యవాణి, రంగన్న, కాశీనాథ్, నెట్టేకల్ తదితర ఉపాధ్యాయులను సత్కరించారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆస్పరి, న్యూస్‌టుడే: విద్యార్థులంతా ఉన్నత శిఖరాలకు చేరినప్పుడే ఉపాధ్యాయులకు ఆత్మసంతృప్తి కలుగుతుందని పూర్వ ఉపాధ్యాయులు నవాజ్, శేఖర్, వెంకటేష్ అన్నారు. మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో 2008-2009 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు కృషి

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో క్షయ నివారణకు కలిసికట్టుగా కృషి చేద్దామని జిల్లా ఉపవైద్యాధికారిణి డాక్టర్ సత్యవతి అన్నారు. గురువారం స్థానిక టీబీ. యూనిట్‌లో క్షయ రోగులకు దాతల సహకారంతో ఉచితంగా పోషకాహార కిట్లు అందించి మాట్లాడారు. రోగుల గుర్తింపులో ప్రజలు సహకరించాలన్నారు. ఎంపీహెచ్ఎస్ బాబురాజు, లలితమ్మ, స్వరూప్‌రాజు, పద్మావతి, వెంకటలక్ష్మి, సుబ్బమ్మ పాల్గొన్నారు.

మహిళపై దాడి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఇస్వీ గ్రామానికి చెందిన శ్యామలమ్మను కుటుంబ విషయంలో వీరారెడ్డి దాడి చేసినట్లు ఇస్వీ ఎస్సై నాగేంద్ర గురువారం తెలిపారు. బాధితురాలు శ్యామలమ్మ ఫిర్యాదు మేరకు వీరారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కస్తూర్బాలో నియామకాలకు దరఖాస్తులు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వంట నిర్వాహకులు, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో రంగస్వామి తెలిపారు. మద్దికెర కేజీబీవీలో సహాయ వంట నిర్వాహకులు-2, ఆదర్శ పాఠశాలలో చౌకీదార్-1, వంట నిర్వాహకులు-1, సహాయ వంట నిర్వాహకులు-1 చొప్పున మొత్తంగా ఈ రెండు పాఠశాలల్లో 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఏడో తరగతి అర్హతతో ఈ నెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

తుగ్గలి, న్యూస్‌టుడే: కస్తూర్బా విద్యాలయంలో ఖాళీగా ఉన్న పొరుగు సేవల పద్ధతిన బోధనేతర సిబ్బంది పోస్టులక దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రామవెంకటేశ్వర్లు తెలిపారు. స్కావెంజర్, వంట మనిషి, వాచ్‌మెన్ పోస్టులకు ఆసక్తి గల వారు ఈ నెల 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో పేర్కొన్నారు.

దుకాణాలు 12.. దరఖాస్తులు 212

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని 12 మద్యం దుకాణాల నిర్వహణకు గురువారం సాయంత్రం వరకు 212 దరఖాస్తులు అందాయి. ఆదోని పట్టణంలో 8, గ్రామీణం, కౌతాళం మండల పరిధిలో 2 దుకాణాల చొప్పున నిర్వహణ కోసం ఎక్సైజ్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. మొత్తం 12 దుకాణాలకు గుత్తేదారులు 212 దరఖాస్తులు చేశారని సీఐ సైదుల్ తెలిపారు. శుక్రవారం ఆఖరి రోజు కావడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల కోసం గురువారం మరిన్ని దరఖాస్తులు వచ్చినట్లు పత్తికొండ ఆబ్కారి సీఐ విశ్వేశ్వరరావు తెలిపారు. తాజాగా మరో 41 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటి వరకు మొత్తం 236 వచ్చినట్లు ఆయన తెలిపారు.

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ మండలానికి మూడు మద్యం దుకాణాలకు అత్యధికంగా 131 దరఖాస్తులు వచ్చినట్లు ఆబ్కారీ సీఐ విశ్వేశ్వరావ్ తెలిపారు. 11వ తేదీన మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు ముగియనుంది. ఎన్నడూ లేని విధంగా దరఖాస్తులు రావడంతో మండల ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆలూరు, హాలహర్వి, చిప్పగిరి, హోలగుంద, ఆస్పరి మండల్లాలో 9 మద్యం దుకాణాలకు 167 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పంచలోహ ఉత్సవమూర్తుల వితరణ



దాతలను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు



మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర- కసాపురం గ్రామాల మధ్య రూ.5 కోట్లతో నిర్మించిన లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి భక్తులు ఉత్సవ మూర్తులను అందించారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన ఇనుగూరు నాగరత్నమ్మ, శంకరనారాయణగుప్త దంపతులు రూ.3.50 లక్షలతో చేయించిన పంచలోహ ఉత్సవ మూర్తులను గురువారం నిర్వాహకులకు అందజేశారు. పరశురాముడు దంపతులు సత్కరించారు.

మహాంకాళమ్మ ఆలయంలో దుర్గాష్టమి

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని పురపాలక మైదానంలో కొలువైన బన్ని మహాంకాళమ్మ ఆలయంలో గురువారం దశరా నవరాత్రి పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్నదానం చేశారు. పురపాలక ఛైర్‌పర్సన్ శాంత, ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, హాల్వీ వెంకటేష్, వీరేష్‌స్వామి, సంతోష్‌స్వామి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు పట్టణంలోని హొళగుంద వెళ్లే మార్గంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి, మండల కార్యదర్శి శేకీర్, మైన కోరారు. స్థానిక జ్యోతిబసు భవనంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో కొంత దూరం వరకు రహదారి అధ్వానంగా మారిందని అన్నారు. చిన్న పాటి వర్షానికే రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండు చేశారు.

తుగ్గలిలో అన్నదానం

తుగ్గలి, న్యూస్‌టుడే: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తుగ్గలి రామాలయం ఆవరణలో భక్తులకు గురువారం అన్నదానం చేపట్టారు. ముందుగా భక్తులు దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసుకొన్న దుర్గాదేవి విగ్రహానికి పూజలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు.

మద్దికెరలో దుర్గాష్టమి వేడుకలు

మద్దికెర, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమి వేడుకలు నిర్వహించారు. స్థానిక నగరేశ్వరాలయంలో వేడుకలను ఆర్యవైశ్యులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారు గురువారం దుర్గామాతగా భక్తులకు దర్శనమిచ్చారు.

వాల్మీకి జయంతిని విజయవంతం చేయండి

హొళగుంద, న్యూస్‌టుడే: ఈ నెల 17న వాల్మీకి జయంతిని అందరూ కలిసి విజయవంతం చేద్దామని వాల్మీకి సంఘం నాయకులు కృష్ణయ్య, తోక వెంటేష్ పిలుపునిచ్చారు. హొళగుంద కూడలిలో గురువారం వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వారు మాట్లాడారు. హొళగుందలో నిర్వహించే జయంతి ఉత్సవాలకు పార్టీలకు, కులాలకు అతీతంగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరంగ, తిక్కస్వామి, సిద్దు, లక్ష్మన్న, చంద్ర, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ పప్పు శనగ పంపిణీ


చిప్పగిరి, న్యూస్‌టుడే: మండలంలోని రైతులకు మూడు వేల క్వింటాళ్ల పప్పు శనగ గురువారం పంపిణీ చేశామని వ్యవసాయాధికారి జయలక్ష్మి తెలిపారు. చిప్పగిరి మండలానికి 4,450 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సారు రాకుంటే.. సెలవే

☛ ఏకోపాధ్యాయ పాఠశాలలతో అవస్థలు

☛ వాలంటీర్ల నియామకంపై ప్రభుత్వం దృష్టి

ఆలూరు గ్రామీణ, హాలహర్వి, న్యూస్‌టుడే: అసలే పశ్చిమ ప్రాంతం.. పైగా కరవుతో అల్లాడిపోతున్న పల్లెలు.. పనులు వెతుక్కుంటూ పట్నం వెళ్లే కుటుంబాలు.. ఇలాంటి గ్రామాలపై దృష్టిసారించకపోతే చదువు సాగడం నెరవేరని కలే. నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. వీటిలో నాలుగు మండలాల్లోని 36 పాఠశాలలు ఏకోపాధ్యాయులతోనే కొనసాగుతున్నాయి. విద్యార్థులకు ఏమాత్రం చదువు అందుతుందో ఇట్టే తెలిసిపోతుంది. ప్రధానంగా హాలహర్వి, ఆస్పరి, హొళగుంద, దేవనకొండ మండలాల్లో మొత్తం 154 పాఠశాలలున్నాయి. వాటిలో 36 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో సాగుతుండగా.. పది పాఠశాలల్లో ఉపాధ్యాయులే లేకపోవడం గమనార్హం. ఇతర పాఠశాలల ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ.. బోధన మమ అనిపిస్తున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆ రోజు సెలవే. పోనీ సర్దుబాటు చేయాలంటే.. విద్యాధికారులకు తలపోటుగా మారింది.



కొక్కరచేడులో ఏకోపాధ్యాయుడుతో కొనసాగుతున్న పాఠశాల

సమస్య పరిష్కరిస్తేనే పాఠాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే విద్యావ్యవస్థను బలోపేతం చేసేప్రయత్నాలు సాగిస్తోంది. నెల రోజుల కిందట పాఠశాలల్లో విద్యావాలంటీర్లను నియమిస్తామని ఉపాధ్యాయుల కొరతను తీర్చడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రకటించింది. ఉపాధ్యాయుల కొరత ఉన్న వాటికి ప్రాధాన్యం ఇస్తే.. విద్యార్థులకు మేలు జరుగుతుంది. గతంలో యువగళం పాదయాత్రలో భాగంగా ఆలూరు నియోజకవర్గంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటించిన సందర్భంలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో వెనుకబడిన పశ్చిమ ప్రాంతంపై దృష్టి సారించి, సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తెదేపా సీనియర్ నాయకుడి మృతి

పెరవలి(మద్దికెర), న్యూస్‌టుడే: మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు పారా రంగస్వామి(53) పాము కాటుతో మృతి చెందారు. తన పొలంలో పాము కాటుకు గురయ్యారు. బాధితుడిని చికిత్స నిమిత్తం అనంతపురం జిల్లా గుంతకల్లుకు తరలించేలోగానే మార్గమధ్యలో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. రంగస్వామి భార్య కొన్నేళ్ల కిందట మృతి చెందారు. కుమారుడు విశ్వవర్ధన్ అనంతపురంలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులిద్దరూ మృతిచెందడంతో ఆ యువకుడు అనాథగా మారాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుంటలో గుర్తుతెలియని మృతదేహం

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆస్పరి సమీపంలోని స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు ఆస్పరి సీఐ మస్తాన్‌వలీ తెలిపారు. మృతుడి వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్లలోపు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు



ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా లింగన్న

గోనెగండ్ల, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో రిక్రియేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఆర్‌ఈఎఫ్) రాష్ట్ర కమిటీ ఎంపిక జరిగింది. ఈ కమిటీలో గోనెగండ్ల మండలం పెద్దిగంగ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు లింగన్నకు రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధిగా ఎంపికయ్యారు. ఉద్యోగుల సమస్యలపై తనవంతు కృషి చేస్తానని లింగన్న పేర్కొన్నారు. కర్నూలు జిల్లా తరపున రాష్ట్ర కమిటీలో గోనెగండ్ల వాసికి చోటు కల్పించడం హర్షణీయమని సోమన్న, సుందరం, దానయ్య పేర్కొన్నారు.

డీఎస్సీ కొలువు పట్టారు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: తెలంగాణ డీఎస్సీ ఫలితాల్లో గోనెగండ్లకు చెందిన వి.ఈశ్వర్ ప్రతిభ చూపి హైదరాబాదు జిల్లాలో నాలుగో ర్యాంకు సాధించారు. గ్రామానికి చెందిన వడ్ల శేఖర్, పుణావతి దంపతులు దర్జీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి కుమారుడు ఈశ్వర్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పది వరకు చదివారు. తెలంగాణ టెట్‌లో 128 మార్కులు డీఎస్సీ పరీక్షలో 82.57 మార్కులు సాధించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఎమ్మిగనూరు (గ్రామీణం) : 80085 73794 (10 AM TO 1 PM)
కోడుమూరు : 80085 73776

నందవరం, న్యూస్‌టుడే: **సమస్య:** ముగతి బీసీ కాలనీలో సీసీ రహదారి, డ్రైనేజీ కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. –సోమన్న, ముగతి
సమాధానం: నిధులు మంజూరు కాగానే సీసీ రహదారి, డ్రైనేజీ ఏర్పాటు చేస్తాం. –లక్ష్మీదేవమ్మ, ఎంపీడీవో, నందవరం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: **సమస్య:** మండలంలోని హులికన్వి గ్రామంలో చాలా రోజుల నుంచి కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వలు నిండి దుర్వాసన వెదజల్లుతోంది. –గ్రామస్థులు, హులికన్వి
సమాధానం: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తా. పంచాయతీలో నిధులు అనుసరించి పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు చేపడతాం. –జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు

కోసిగి, న్యూస్‌టుడే: **సమస్య:** చింతకుంట గ్రామంలో కాలువలు నిండి మురుగు రోడ్డుపై పారుతోంది. అధికారులు పట్టించుకోవడం లేదు. –రవి కుమార్, చింతకుంట
సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి కాలువలో పూడిక తీయిస్తాం. –శరణ్య, సర్పంచి

సి.బెళగల్, న్యూస్‌టుడే: **సమస్య:** ఐనగండ్ల నుంచి గుండ్రేవుల ఆర్టీసీ బస్సు సర్వీసును కొనసాగించండి. –నాగరాజు, ఐనగండ్ల
సమాధానం: తక్షణమే ఎమ్మిగనూరు డిపో మేనేజరు దృష్టికి తీసుకెళ్లి గుండ్రేవుల వరకు పొడిగించేందుకు చర్యలు తీసుకుంటాం. –ఈశ్వరయ్యస్వామి, ఈవోఆర్డీ, సి.బెళగల్

సమస్య: కె.శింగవరంలో భంభం ఆంజనేయస్వామి ఎత్తి పోతల పథకానికి విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేయాలి. –రామచంద్రరెడ్డి, కె.శింగవరం
సమాధానం: ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం నూతన విద్యుత్తు మోటార్లు వచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తాం. –నాగార్జున, ఐడీసీ డీఈఈ, కర్నూలు

రూ.50 వేల చెక్కు అందజేత



బీవీకి చెక్కు అందజేస్తున్న గుడ్‌షెపర్డ్ పాఠశాల ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం గుడ్‌షెపర్డ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు సేకరించిన రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి పాఠశాల ఉపాధ్యాయులు అందజేశారు. ఎమ్మిగనూరులోని బీవీ నివాసంలో గురువారం ఆయనను కలిసి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్‌షెపర్డ్ పాఠశాల ప్రిన్సిపల్ జాన్‌మోజెస్ మాట్లాడారు. ఆపదలో ఉన్న వరద బాధితులను మరెన్ని సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఉపాధ్యాయులు శరణప్ప, వెంకటేశ, బద్రినాథ్ పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల కూటమి ప్రభుత్వ హయాంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం పారిశుద్ధ్య కార్మికులకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్మికుల నిధులు, పీఎఫ్, ఇతర వసతులు కల్పిస్తామన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కార్మికులను విస్మరించారని ఆరోపించారు. పురపాలక కమిషనర్ గంగిరెడ్డి, తెదేపా నాయకులు దామా నరసింహులు, కౌన్సిలర్ ఉమామహేశ్వర్, నరసప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు వేగవంతం చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సూచించారు. గురువారం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా పట్టణంలో డ్రైనేజీ, కాల్వలు, రోడ్ల పనులు కోసం టెండర్లు పిలిచిన వాటిని త్వరగా ఆమోదించాలని ఈఈ చంద్రమోహన్‌ను ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.18 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈఈ చంద్రమోహన్ మాట్లాడారు.. పట్టణంలో డ్రైనేజీ పనులు సర్వే చేసిన తరువాత నిర్మిస్తే బాగుంటుందని ఎమ్మెల్యేకు సూచించారు. పురపాలక కమిషనర్ గంగిరెడ్డి, డీఈలు నీరజ, రాజునాయక్, విక్టర్, వెంకటేశ్వర్లు, ఏఈ మదన్, శరత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని సమస్యలు పరిష్కరించాలని ఎంబీ జెరూషలేము కాలనీ వాసులు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గురువారం పురపాలక సంఘం కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలు వివరించారు.

వెలగని దీపాలు.. చీకట్లో ఇక్కట్లు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: శివారు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని చెప్పి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. ఐదేళ్లలో వీధి దీపాల నిర్వహణ గాలికి వదిలేశారు. ప్రైవేటు ఏజెన్సీలకు వీధి దీపాలు అప్పగించడంతో వాటి నిర్వహణ అస్తవ్యస్థంగా మారింది. ఎల్‌ఈడీ దీపాల ముసుగులో వీధి దీపాల నిర్వహణకు నిధులు తూతూ మంత్రంగా మంజూరు చేయడంతో కొత్త వెలుగు లేవు. ఆయా ప్రాంతాల్లో వీధి దీపాలు లేని కాలనీల్లో చీకట్లు కమ్ముకున్నాయి.

రూ.2.40 కోట్లతో..

2017లో ఎల్‌ఈడీ వీధి దీపాలు అమర్చేందుకు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. అప్పట్లో రూ.2.40 కోట్లతో దాదాపు మూడు వేలు వీధి దీపాలు మార్చారు. ఎల్‌ఈడీలు కావడంతో వీటి నిర్వహణ బాధ్యతను దాదాపు ఏడేళ్ల పాటు చేపట్టాలి. ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ హయాంలో కొత్త వీధి దీపాలు అమర్చలేదు. ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టి మమ అనిపించారు. ఏటా నిర్వహణ కోసం ఏజెన్సీకి రూ.30 లక్షలుపైగానే చెల్లించే వారు. 2023 నవంబరులో ఏజెన్సీ గడువు పూర్తి కావడంతో మున్సిపాలిటి బాధ్యతలు చేపట్టింది.

500 దీపాలు లేవు

డిసెంబర్ 2023 నుంచి వీధి దీపాలు మున్సిపాలిటీ నిర్వహిస్తోంది. అయితే గతంలో వీధి దీపాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో నిర్వహణ తూతూ మంత్రంగా చేపట్టి వదిలేసింది. పట్టణంలో శివారు ప్రాంతాల్లో దాదాపు 500 వీధి దీపాలు లేవు. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మించుకున్న లబ్ధిదారులు సొంతంగా స్తంభాలు, తీగలు అమర్చుకున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం
–శరత్, ఏఈ, ఎమ్మిగనూరు

శివారు ప్రాంతాల్లో వీధి దీపాలకు తక్షణమే మరమ్మతుల చేయిస్తాం. ఆయా వార్డుల్లో లేని ప్రాంతాలను గుర్తించాం. దాదాపు 400కుపైగానే వీధి దీపాలు కొత్తవి అవసరం. వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.



ఎమ్మిగనూరు పట్టణం మునెప్పనగర్ కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న యజమానికి సొంతంగా స్తంభం వేసుకునేందుకు దాదాపు రూ.6 వేలు ఖర్చు చేశారు. తీగలు లాగిన వీధి దీపం అమర్చలేదు. రాత్రివేళ చీకటితో విషపురుగులతో కాలనీవాసులు భయందోళనకు గురవుతున్నారు.



సాయిగణేష్ కాలనీలో దాదాపు 60కి పైగానే ఇళ్లు ఉన్నాయి. ఇంటి యజమానులు సొంతంగా విద్యుత్తు స్తంభాలు, తీగలు ఏర్పాటు చేసుకున్నారు. కానీ అధికారులు వీధి దీపాలు అమర్చలేదు. శివారు కాలనీ కావడంతో రాత్రులు బయటకు రావాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాల కోసం పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేదని ఆయా కాలనీవాసులు వాపోయారు.

కంపుకొడుతున్నా.. కనికరించరు



గోనెగండ్ల మండలం బి.అగ్రహారం ఎస్సీ కాలనీలో కనీస వసతులు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరంతా రహదరులపై ప్రవహిస్తోంది. అపరిశుభ్ర పరిసరాల వల్ల మండలంలో చిన్నమర్రివీడు, వేముగోడు, పుట్టపాశం తదితర గ్రామాల్లో నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. కేసుల విచారణలో అపరిశుభ్ర పరిసరాలే కారణమని వైద్యాధికారులు వెల్లడించారు. కాలనీ సమస్యలపై పలుమార్లు సంబంధితాధికారులు, పాలకులకు విన్నవించినా కనికరించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. –న్యూస్‌టుడే, గోనెగండ్ల

విద్యుత్తు నియంత్రిక.. ప్రమాదాలకు నిలయం



ఎమ్మిగనూరు పట్టణం కూరగాయల మార్కెట్లో ఉన్న విద్యుత్తు నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్నాయి. నియంత్రిక చుట్టు గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. గాలి వీచినప్పుడు రెండు తీగలు రాసుకొని నిప్పు రవ్వలు వస్తున్నాయి. అధికారులు స్పందించి విద్యుత్తు నియంత్రికలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి తీగలు సరి చేయాలి కాలనీవాసులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

సుంకులమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



సన్నిధిలో ఎమ్మెల్యే, తెదేపా నాయకులు

కె.నాగలాపురం (గూడూరు) న్యూస్‌టుడే: మండల పరిధిలోని కె.నాగలాపురం సుంకులమ్మ అమ్మవారిని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి హోమంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ఈవో నరసయ్య అర్చకులు కేశవ్ పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

శ్రీమఠంలో విశేష పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

మంత్రాలయ, న్యూస్‌టుడే: శ్రీమఠంలో గురువారం పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు బృందావనానికి నిర్మాల్యం, పంచామృతాభిషేకం చేశారు. బంగారు, నవరత్న కవచాలు, విశేష పూలతో అలంకరించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పూజా మందిరంలో జయ దిగ్విజయ, మూలరాములకు, బ్రహ్మాకరచిత నరసింహ స్వామి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవత మంచాలమ్మకు, రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి హారతి ఇచ్చారు. భక్తులకు ఫలమంత్ర అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలకు బంగారు పల్లకి సేవ, చెక్క, వెండి అంబారి, వెండి, బంగారు, నవరత్న రథోత్సవాలపై ఉంచి పీఠాధిపతి హారతి ఇచ్చారు.



విశేష అలంకరణలో బృందావనం

ఉరుకుందలో భక్తుల సందడి

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారికి ఉదయాన్నే అభిషేకం, సహస్ర నామార్చన, మహా మంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు.

కంబదహల్ (సి.బెళగల్), న్యూసుటుడే: మండలంలోని కంబదహల్‌లో గురువారం సాయిబాబా ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు జరిపారు. మధ్యాహ్నం 12 గంటలకు సాయిబాబాకు కాగడా హారతి ఇచ్చారు. సాయంత్రం పల్లకీలో సాయి బాబా ప్రతిమను ఆసీనం చేసి పురవీధుల్లో మేళతాలాలతో ఊరేగించారు. పోలకల్‌లో సద్గురు శింగరయ్య ఆలయంలో సర్వజ్యోతి పీఠాధ్యక్షుడు వి.రాజరత్నం ఆధ్వర్యంలో నాగదోష నివారణ ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

సి.బెళగల్, న్యూసుటుడే: సి.బెళగల్, పోలకల్ గ్రామాల్లో గురువారం దేవీనవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించారు. సి.బెళగల్‌లో విశ్వేశ్వర ఆలయంలో అమ్మవారి కాంస్య విగ్రహాన్ని దుర్గాదేవి, పోలకల్‌లో లక్ష్మీదేవి చౌడేశ్వరి దేవీ ఆలయాల్లో దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



గోనెగండ్ల: అమ్మవారి విగ్రహం వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు



మంత్రాలయం: సరస్వతీ దేవి అలంకరణలో గ్రామ దేవత మంచాలమ్మ



మంత్రాలయం గ్రామీణం: ఉప్పరహల్‌లో దుర్గాదేవి అలంకరణలో గ్రామదేవత



గూడూరు గ్రామీణం: చౌడేశ్వరిదేవి ఆలయంలో దుర్గాదేవిగా..



మంత్రాలయం: వాసవీ కల్యాణ మండపంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

మహిషాసుర మర్దిని.. దుర్గా రూపిణీ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాష్టమి పురస్కరించుకొని అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంత్రాలయం వాసవీ కల్యాణ మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమాలు నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి మఠంలో కొలువైన గ్రామదేవత మంచాలమ్మ సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఎమ్మిగనూరు హెచ్‌బీఎస్ కాలనీలో గాయత్రీదేవి దుర్గాదేవిగా అలంకరించి, చండీ యాగం నిర్వహించారు. –న్యూస్‌టుడే బృందం



గూడూరు: కె.నాగలాపురంలో భక్తుల దర్శనమిచ్చిన దుర్గాదేవిగా సుంకుల



గూడూరు: వీరభద్ర ఆలయంలో దుర్గాదేవి



ఎమ్మిగనూరు: హెచ్‌బీఎస్ కాలనీలో..



కోడుమూరు గ్రామీణం: ఎస్‌ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో పూజలు ..



కోడుమూరు గ్రామీణం: వల్లెలాంభదేవి



ఎమ్మిగనూరు గ్రామీణం: కందనాతిలో ఊరేగింపు



ఎమ్మిగనూరు గ్రామీణం: చేనేత మైదానంలో దుర్గాదేవి..



ఎమ్మిగనూరు గ్రామీణం వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవి

గొర్రెల పెంపకం సంఘం జిల్లా డైరెక్టర్‌గా రాముడు



ఎన్నికైన రాముడుని అభినందిస్తున్న నాయకులు

కోసిగి, న్యూస్‌టుడే: గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం జిల్లా డైరెక్టర్‌గా కోసిగికి చెందిన రాముడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కర్నూలులో గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. జంపాపురం గొర్రెల సహకార సంఘం అధ్యక్షులు వీరనాగప్ప, ఈరన్న అభినందనలు తెలిపారు. గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం నాయకులు వెంకటరాముడు, మల్లేష్, గోవిందు, రామకృష్ణ, ఆంజనేయులు, శేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిధులు విడుదల.. పంచాయతీలకు కాసుల పంట

కోసిగి, న్యూస్‌టుడే: వైకాపా గత ఐదేళ్ల పాలనలో గ్రామ పంచాయతీల గల్లా పెట్టెలు ఖాళీ అయిపోయాయి. నాటి ప్రభుత్వం ఎలాంటి నిధులు ఇవ్వకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులను సైతం లాక్కుంది. పంచాయతీల ఖాతాలకు నిధులు జమ చేసినట్లే చేసి వెంటనే జగన్ ప్రభుత్వం తీసుకోవడంతో గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచులు ఏమీ చేయలేక పోయారు. కనీసం గ్రామాల్లోని కాలువల్లో పూడిక తీత, బ్లీచింగ్, వీధి దీపాల మరమ్మతులు లాంటి పనులను కూడా చేయలేదు. దీంతో కోసిగి మండలంలో కొందరు సర్పంచులు తమ గౌరవానికి విఘాతం కలుగుతోందని భావించి సొంత డబ్బులు వెచ్చించి పనులు చేయించారు. రాష్ట్రంలో మళ్లీ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామ పంచాయతీలకు కొత్త కళ సంతరించుకుంది. ఆర్థిక సంఘం నిధులు ఇవ్వడంతో గ్రామాభివృద్ధికి ఊతం కలుగుతుందని సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ	విడుదలైన నిధులు రూ.లక్షల్లో
కోసిగి	27.83
చిన్న భూంపల్లి	3.48
దొడ్డి బెళగల్	5.56
జంపాపురం	3.64
సాతనూరు	3.51
వందగల్లు	3.96

మిగతా పంచాయతీలకు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలకుపైగా నిధులు వచ్చాయి.

కోసిగి మండలానికి రూ.83.59 లక్షలు

మండలంలో 24 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.83,59,564 విడుదలయ్యాయి. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన పనులు చేపట్టి తిరిగి గ్రామాల్లో తలెత్తుకొని తిరిగే అవకాశం వచ్చిందని సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటిలో బేసిక్ గ్రాంట్ 40 శాతం, టైడ్ గ్రాంట్ 60 శాతం, టైడ్ గ్రాంట్‌లో 50 శాతం నిధులు పారిశుద్ధ్య నిర్వహణకు, మరో 50శాతం రక్షిత నీటి సరఫరాకు, మిగిలినవి వీధి దీపాలు, సిబ్బంది వేతనాలు, ఇతర కార్యకలాపాలకు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతాం
–ఈవోపీఆర్డీ, అరుణ్ రషీద్

గత నెలలో పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో రక్షిత నీటి సరఫరా, వీధి దీపాలు, కాలువలు, పారిశుద్ధ్య పనులు చేపడుతాం.

రాయితీపై శనగ విత్తనాలు

మంత్రాలయం. న్యూస్‌టుడే: రాయితీపై శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి జీరా గణేశ్ గురువారం తెలిపారు. 2024 రబీకి రాయితీపై శనగ విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కావలసిన వారు రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. క్వింటా శనగ విత్తనాలు రూ.9,400 ఉండగా రాయితీ రూ.2,350 పోను రూ.7,050 చెల్లించాలన్నారు.

అభిరుచికి అనుగుణంగా సేవలు



సమావేశంలో చర్చిస్తున్న వెలుగు ఏపీఎం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల అవసరాలకు, అభిరుచికి అనుగుణంగా మహిళ మార్టుల్లో నిత్యవసర సరకులను అందుబాటులో ఉంచాలని వెలుగు ఏపీఎం సుబ్బయ్య తెలిపారు. వెలుగు కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏడాదికి రూ. 2.83 కోట్ల టర్నోవర్ ఉంటుందన్నారు. బహిరంగ దుకాణాల్లో కంటే తక్కువ ధరకు ఇవ్వడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. పొదుపు సంఘాలకు ఏడాదికి రూ.40 కోట్లు బ్యాంకు రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

రహదారులకు ఉపాధి నిధులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామంలోని రహదారుల నిర్మాణానికి ఉపాధి పథకం కింద నిధులు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ డీఈఈ క్రిరెన్న తెలిపారు. ఈ మేరకు ఏఈ గంగరాజ్‌తో కలిసి అమడగుంట్లలో గురువారం అంతర్గత దారులను పరిశీలించారు. గ్రామానికి 4 పనులకు సంబంధించి రూ.32 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

సుంకేసులకు 11,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి 11,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు జలాశయ ఇంజినీరు రాజు గురువారం తెలిపారు. జలాశయంలో 1.235 టీఎంసీల నీళ్లు నిల్వ ఉండటంతో దిగువకు 8,958 క్యూసెక్కులు, కేసీ కాలువకు 2,445 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించండి

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం తుంగభద్ర నదీ తీరంలో భక్తులకు స్నానాలకు కట్టుదిట్టమైన భద్రతా సౌకర్యాలు కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ కోరారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి ఉపతహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు లక్ష్మణ్‌నాయక్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు ఉద్యమాలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని మాలమహానాడు నాయకుడు నరసన్న పేర్కొన్నారు. గురువారం సోమప్ప కూడలిలో రిలే నిరహార దీక్ష, ధర్నా చేపట్టారు. నాయకులు నాగరాజు, ఈరన్న, ఆర్లప్ప, ముక్కరన్న తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి

కోసిగి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన కోసిగిలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోసిగి సిద్ధరుడా స్వామి ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న చిన్నంపల్లి తిమ్మయ్య, లక్ష్మి దంపతులకు మూడో కుమారుడు చిన్నంపల్లి ఆంజనేయులు(17) సాయంత్రం గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళ్తుండగా ఉరుకుంద ఆర్చి సమీపంలో వాహనం అదుపు తప్పి పడిపోయారు. యువకుడి తలకు బలమైన గాయాలు అయ్యాయి. గుర్తించిన కుటుంబ సభ్యులు, స్థానికులు 108 వాహనంలో ఆదోని ఆసుపత్రికి తరలిస్తుండంగా మార్గమధ్యంలో మృతి చెందారు.

చికిత్స పొందుతూ యువతి..

నందవరం, న్యూస్‌టుడే: నిప్పంటిచుకొని ఆత్మహత్యకు పాల్పడిన యువతి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. నందవరం పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మాచాపురం గ్రామానికి చెందిన పద్మమ్మ, రాజేశ్‌ల కుమార్తె నయోమి(17) కొన్ని నెలలుగా కండరాలు, కీళ్ల నొప్పులతె బాధపడుతుందన్నారు. చికిత్స కోసం డాక్టర్లును సంప్రదించినప్పటికీ తగ్గకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గ్యాస్ లీకు చేసి నిప్పంటించుకొన్ని ఆత్మహత్మకు పాల్పడింది. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు గురువారం కర్నూలులోని సంఘం కార్యాలయంలో ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురంలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రవీణ్‌బాబుకు రూ.34,500 చెక్కును అందజేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హరిదాసు ఈరన్న, జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, విశ్రాంత ఎస్‌ఈ సురేంద్రనాథ్, విశ్రాంత డీఎస్పీ రామయ్య పాల్గొన్నారు.



ప్రవీణ్‌బాబుకు చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెదేపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఆయన హుసేనాపురంలో రాయితీ పప్పుశనగ విత్తనాలను రైతులకు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో సుధాకర్, ఏఈవోలు మధు, భాస్కర్, నాయకులు నారాయణ, మహబూబ్ బాషా, రాముడు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
డోన్ : 63004 66875

కర్నూలు నగర పాలక సంస్థ: సమస్య: శ్రీరామనగర్, లక్ష్మీనగర్‌లో కాల్వలు శుభ్రం చేయాలి. వర్షాలు పేరుకు పోవడంతో దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

సమస్య: జోహరాపురం వీధుల్లో విద్యుద్దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికులు**

సమాధానం: సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తాం. **- నగర పాలక అధికారులు**

ఉపకార వేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లాలో తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించని తొమ్మిది, ఇంటర్ విద్యార్థుల నుంచి ప్రధానమంత్రి యశస్వి పథకం కింద ఉపకార వేతనాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి వెంకటలక్ష్మి తెలిపారు. 9వ తరగతిలో మెరిట్ ఆధారంగా ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.75 వేలు, ఇంటర్ వారికి రూ.1.25 లక్షలు ఇస్తారన్నారు. 9వ తరగతి విద్యార్థులు ఈ నెల 15 లోగా, ఇంటర్‌వారు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డివిజనల్ కోఆపరేటివ్ అధికారి బాధ్యతల స్వీకరణ

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడాకారిణి షేక్‌ఫ్రైన్ కర్నూలు డివిజనల్ కోఆపరేటివ్ అధికారిగా గురువారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి రామాంజనేయులు సమక్షంలో ఆమె విధుల్లో చేరారు.

సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టర్‌గా...

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టర్‌గా యశోద బాయి గురువారం బాధ్యతల స్వీకరించారు. సర్కిల్ కార్యాలయంలో సీఎస్‌గా రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలు సర్కిల్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వారం కిందట ఉత్తర్వు జారీ చేసింది.

రద్దీ నియంత్రణకు సిగ్నల్స్ పడేదెప్పుడు?



కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే: కర్నూలులో ట్రాఫిక్ సిగ్నల్స్, సీసీ కెమెరాల నిర్వహణ సరిగా లేక పోవడంతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్భాటంగా ఏర్పాటు చేస్తున్నారు తప్ప, వాటి నిర్వహణకు శాశ్వత సాంకేతిక నిపుణులను నియమించడం లేదు. ఒకవైపు రద్దీ సమస్య తీవ్రమవుతుండగా మరోవైపు గొలుసు దొంగతనాలు, ఆటోలు, ఇళ్లలో అపహరణలు, దాడులు ఇతరత్రా నేరాలు పెరుగుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

2019కి ముందు తెదేపా ప్రభుత్వ హయాంలో కర్నూలులో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అమర్చారు. నగరంలోని 18 కూడళ్లలో ఒప్పంద ప్రాతిపదికన ప్రచార బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. నిర్వహణ బాధ్యతలను తమిళనాడుకు చెందిన ఓ సంస్థకు అప్పగించారు. అయితే నిర్వహణ నిధులు సరిగా చెల్లించక పోవడంతో ఆ సంస్థ చేతులెత్తేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. ఇప్పటికీ వీటి నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒకరిద్దరు పోలీసులకు ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణకు సంబంధించి సాంకేతిక శిక్షణ ఇప్పించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కారణంగా రాజ్‌విహార్ మినహా ఇతర కూడళ్లలో సిగ్నల్స్ పని చేయడం లేదు. కలెక్టరేట్, గాయత్రీ ఎస్టేట్, కొత్త బస్టాండు ఈద్గా, బళ్లారి చౌరస్తా, కోట్ల కూడలి తదితర ప్రాంతాల్లో రద్దీని నియంత్రించాలంటే ట్రాఫిక్ సిగ్నల్స్ కచ్చితంగా పని చేయాల్సిన అవసరం ఉంది. బళ్లారి చౌరస్తాలో సిగ్నల్స్ పని చేయని కారణంగా ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 12 మంది ట్రాఫిక్ పోలీసులు అవిశ్రాంతంగా పని చేయాల్సి వస్తోంది. కలెక్టరేట్ వద్ద సిగ్నల్స్ సరిగా పని చేయకపోవడంతో బుధవారపేట వైపు, కలెక్టరేట్‌లోకి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు దాటేవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇటీవల అనంతపురం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన మనుమడి కోసం వచ్చి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని ప్రాణాలు కోల్పోయారు. గాయత్రీ ఎస్టేట్ వద్ద సిగ్నల్స్ పని చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. బిర్లా గేట్ వద్ద వద్దనున్న సిగ్నల్స్ అలంకారప్రాయంగా మారాయి. కొత్త బస్టాండు ఈద్గా వద్ద సిగ్నల్స్ పని చేయకపోవడంతో ఆర్టీసీ బస్టాండు నుంచి కల్లూరు వైపు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు వచ్చిన సందర్భాల్లో ట్రాఫిక్ నిలిచిపోతోంది.

సీసీ కెమెరాలదీ అదే పరిస్థితి



కర్నూలులో బిర్లా గేటు వద్ద సీసీ కెమెరాలు

కర్నూలు నగరంలో సీసీ కెమెరాలదీ అదే పరిస్థితి నెలకొంది. ఏవి ఎప్పుడు పని చేస్తాయో, ఎప్పుడు పని చేయవో తెలియని పరిస్థితి నెలకొంది. వైకాపా ప్రభుత్వ హయాంలో 2021-22 సంవత్సరంలో కర్నూలులో 146 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇంకా పలుచోట్ల ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు కోరినా స్పందన కరవైంది. వైకాపా నాయకుడి అనుచరుడి సంస్థకు సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూంలోని సీసీ టీవీలకు కెమెరాలు అనుసంధానం చేయడంతో పోలీసులు నేర పరిశోధనకు ఉపయోగించుకునేవారు. కొంత కాలం తర్వాత సీసీ కెమెరాల నిర్వహణపై నగర పాలక సంస్థ దృష్టి సారించకపోవడంతో పోలీసులు దర్యాప్తు అవసరమైనప్పుడు మరమ్మతులు చేయించుకునేవారు. చివరకు వర్షాలు, ఇతరత్రా కారణాలతో పలుచోట్ల పని చేయని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కర్నూలు నగరంలో గొలుసు చోరీలు, ఆటో దొంగతనాలు, ఇళ్ల అపహరణలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇళ్ల ముందు ఉండే వాహనాలు మాయమవుతున్నాయి. పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించే యత్నం చేసిన ప్రతిసారి ఎక్కడో చోట పని చేయకపోవడంతో దర్యాప్తు ముందుకు సాగడం లేదు. నేరగాళ్లను గుర్తించి పట్టుకోలేకపోవడంతో నేరాలు పెరిగిపోతున్నాయి. ఆటోలపై నియంత్రణ కొరవడింది. హంట్ అండ్ రన్ ఘటనల్లో వాహనాలను గుర్తించడం కష్టంగా మారుతోంది. ఇటీవల నగర పాలక సంస్థ నగరంలో 156 సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ట్రాఫిక్ సిగ్నల్స్, సీసీ కెమెరాల నిర్వహణకు శాశ్వత సాంకేతిక నిపుణులను నియమించాల్సిన ఆవశ్యత ఉంది.

సామూహిక పూజల్లో సంఘటితం కావాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: మహిళలు సామూహిక పూజల్లో సంఘటితం కావాలని వ్యక్తలు వేదవతి, మాతృ మండలి జిల్లా కన్వీనర్ జంపాల రాధిక అన్నారు.



ఆయుధ పూజలో వీహెచ్‌పీ, దుర్గావాహిని, అపార్ట్‌మెంట్‌లోని మహిళలు

నగరంలోని గణేశ్‌నగర్‌లో పార్థసారథి అపార్ట్‌మెంట్‌లో విశ్వహిందూ పరిషత్, మాతృ శక్తి దుర్గావాహిని సంయుక్తాధ్వర్యంలో దుర్గాష్టమి ఆయుధ పూజ నిర్వహించారు. అనంతరం మహిళా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయశ్రీ, శివమ్మ, ఇంద్ర, లావణ్య, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, మహేశ్వరి, జయలక్ష్మి నాగేశ్వరినాయుడు, ప్రమీల పాల్గొన్నారు.

13న దుర్గామాత నిమజ్జనం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ఈ నెల 13న నగరంలోని దుర్గామాత విగ్రహాల నిమజ్జనం ఉంటుందని



పనులు పరిశీలిస్తున్న టీజీ వెంకటేశ్

మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. గురువారం ఆయన సంకల్‌బాగ్‌లోని తుంగభద్ర నదీతీరంలోని దుర్గాఘాట్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఏటా దుర్గామాత విగ్రహాల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ ఏడాది 100కుపైగా విగ్రహాలున్నాయన్నారు. ఆయన వెంట దాశెట్టి శ్రీనివాసులు, జగన్, విఠల్‌శెట్టి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని 19వ వార్డు పరిధిలో బీడీ వర్కర్స్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం నగర పాలక సంస్థ మేనేజర్ చిన్న రాముడును కలిసి వినతిపత్రం ఇచ్చారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షరీఫ్, పార్వతయ్య, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఆసుపత్రి శానిటేషన్ సిబ్బందిపై పర్యవేక్షకుడి ఆగ్రహం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: సర్వజన వైద్యశాలలో వివిధ విభాగాలను ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రభాకరరెడ్డి గురువారం పరిశీలించారు. మార్చురీ వద్ద నున్న డ్రైనేజీ పనులు పరిశీలించి పైపులైన్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆవరణలోని చెత్తకుండీలు పగిలిపోవడంపై సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ సమయ పాలన పాటించాలని, సక్రమంగా విధులు నిర్వహించనివారిపై చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

నకిలీ బంగారంతో మోసం

★ రూ.5 లక్షలతో ఉడాయింపు

చంద్రగిరి, న్యూస్‌టుడే: ఓ అజ్ఞాత వ్యక్తి మాయమాటలు నమ్మి నకిలీ బంగారం కొని రూ.5 లక్షలు మోసపోయిన ఉదంతం చంద్రగిరి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. ఎ.రంగంపేట గ్రామానికి చెందిన పూజారి సుబ్రహ్మణ్యం కూలీగా పనిచేస్తుండగా ఇతని కుమారుడు వెంకటేష్ తిరుపతిలో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నాలుగునెలల కిందట గుర్తుతెలియని వ్యక్తి తన పేరు రమేష్ అని, కర్నూలుకు చెందిన తాను అప్పుడప్పుడు తిరుమలకు వస్తానని పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో గత నెల 17న తిరుపతికి చేరుకున్న ఆయన వెంకటేశ్‌ను కలిశాడు. తాము పొలం పనులు చేస్తుండగా 3.5 కిలోల బంగారు కాసుల నిధి దొరికిందని, అమ్మితే రూ.10 లక్షల వరకు వస్తాయన్నారు. దీంతో వెంకటేశ్ అతన్ని ఇంటికి తీసుకువచ్చి తండ్రికి పరిచయం చేశాడు. ఆ వ్యక్తి తన మాయమాటలతో నమ్మించి చిన్న డబ్బాలో గ్రాము బరువు గల బంగారు కాసు ఇచ్చి పరీక్షించుకోవాలని చెప్పాడు. దీంతో వారు గ్రామంలో పరీక్షించి అసలైనదిగా నిర్ధారించుకున్నారు. ప్రస్తుతం తన వద్ద కిలో కాసులు ఉన్నాయని, రూ.5 లక్షలకే ఇస్తానని చెప్పడంతో ఆయన కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న రూ.5 లక్షలు ఇచ్చి వాటిని తీసుకున్నారు. నగలు చేయించుకోవడానికని బుధవారం వాటిని పరిశీలించగా పూర్తిగా నకిలీవని తెలిసింది. బాధితుడు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు ఎస్సై అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి పేరు గుర్తింపు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 7న కర్నూలులోని నరసింహారెడ్డినగర్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి విదితమే. సదరు మృతుడు విక్రమ్‌గా గుర్తించారు. పాత సీసాలు సేకరించే మృతుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలియకపోవటంతో వీఆర్వో ఫిర్యాదు మేరకు గురువారం కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పండగకు ప్రత్యేక రైళ్లు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: దసరా, దీపావళి పండగల నేపథ్యంలో కర్నూలు నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ గురువారం తెలిపారు. వీటితోపాటు మరికొన్ని నడుపుతామని వెల్లడించారు.

రైలు నంబరు	నుంచి	వరకు	వారం	అక్టోబరులో
07063	కాచిగూడ	తిరుపతి	మంగళ	1, 8, 15, 22, 29
07064	తిరుపతి	కాచిగూడ	బుధ	2, 9, 16, 23, 30
07653	కాచిగూడ	తిరుపతి	గురు	10, 17, 24, 31
07654	తిరుపతి	కాచిగూడ	శుక్ర	11, 18,25, 30
07115	హైదరాబాద్	జైపూర్	శుక్ర	4, 11, 18, 25
07435	కాచిగూడ	నాగర్‌కోయిల్	శుక్ర	4, 11, 18, 25
07436	నాగరకోయిల్	కాచిగూడ	ఆది	6, 13, 20, 27

నవంబరులో కాచిగూడ నుంచి తిరుపతికి మంగళ, గురువారాల్లో 5, 7, 12, 14వ తేదీల్లో 07063 నంబరు రైలును, తిరుపతి నుంచి కాచిగూడకు బుధ, శుక్రవారాల్లో 1, 6, 8, 13, 15 తేదీల్లో 07063 నంబరు రైలు నడుపుతున్నట్లు ఎ.శ్రీధర్ పేర్కొన్నారు.



కర్నూలు ఆధ్యాత్మికం: లలితా పీఠంలో హోమం చేస్తున్న భక్తులు



కర్నూలు ఆధ్యాత్మికం: బాలాజీనగర్‌లో చండీ హోమం చేస్తున్న భక్తులు



కర్నూలు ఆధ్యాత్మికం: సూర్యనారాయణ ఆలయంలో దర్శనం చేసుకుంటున్న భక్తులు



కర్నూలు బి.క్యాంపు: విజ్ఞాన మందిరంలో లలితా సహస్రనామంలో మహిళలు



కర్నూలు బి.క్యాంపు: కుంకుమార్చనల్లో భక్తులు



కర్నూలు బి.క్యాంపు: రాజరాజేశ్వరి ఆలయంలో సంగీత కచేరీలో కళాకారులు

మహాగౌరీ.. మహిషాసుర మర్దిని



కల్లూరు గ్రామీణం: వాసవీ నగర్‌లో అమ్మవారి పూజలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు ఆధ్యాత్మికం, కల్లూరు గ్రామీణం, ఓర్వకల్లు, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అమ్మవారి మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి కల్లూరు పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. జా కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఓర్వకల్లు: హుసేనాపురంలో పూజలు చేస్తున్న మల్లెల రాజశేఖర్ దంపతులు



కల్లూరు గ్రామీణం: కల్లూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో...



కల్లూరు గ్రామీణం: పార్థసారథి నగర్‌లో పాండురంగ స్వామి దేవాలయంలో మహా గౌరీ అలంకరణ



కర్నూలు ఆధ్యాత్మికం: చౌడేశ్వరీదేవి ఆలయంలో మహా దుర్గా దేవి అలంకరణ

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు



కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇందులో జీకే విశాల్, నవీన్, వెంకట శివరాం, బి.కార్తీక్ వెండి పతకాలు, అఖిల్, మోహన్‌కుమార్, శ్యాంసుందర్ కాంస్య పతకాలను గెలిచారు. వీరిని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సభ్యుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, శిక్షకుడు సతీష్‌కుమార్ అభినందించారు.

← పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సభ్యుడు సుబ్రహ్మణ్యంరెడ్డి

పూల పరిమళం.. ధరహాసం



పూలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

పండగ నేపథ్యంలో మరింత ప్రియం

కల్లూరు గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో పూల ధరలు పెరిగాయి. మామూలు రోజులకంటే రెట్టింపయ్యాయి. పూజకు తప్పనిసరి కావడంతో ప్రజలు వాటిని కొనుగోలు చేస్తున్నారు. పండగనాడు ఇంటి అలంకరణతోపాటు దేవతామూర్తుల విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలతో అలంకరిస్తారు. పండగ రెండు రోజులుండే ధరలు కొండెక్కాయి. మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు అంటున్నారు.

కర్నూలు నగరంలో దేవీ శరన్నరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దసరా రోజు అమ్మవారి విగ్రహాలు, ఇంటి అలంకరణకు పూలు వినియోగిస్తారు. వాటిని కొనుగోలు చేయాలంటే కొంత భయపడాల్సి వస్తోంది. అయినా పండగ కావడంతో కొనక తప్పడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. చెండు పూలు, గులాబీ, చామంతి, సన్నమల్లెలు మామూలు రోజులకంటే ధరలు ఎక్కువయ్యాయి. పూలనుబట్టి ధరలు ఉన్నాయి. చెండు పూలు కిలో రూ.120, గులాబీ రూ.500, సన్నమల్లెలు రూ.900, చామంతి రూ.400 వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. చెండు పూలు మినహా మిగతావి కొనుగోలు చేయాలంటే ఒక క్షణం ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. గురువారంకంటే శుక్రవారం కొంచెం రేట్లు పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. పూలను దిగుమతి చేసుకోవాల్సి ఉందని, ఉత్పత్తి తక్కువగా ఉండటం, పండగ కావడంతో ధరలు పెరిగాయంటున్నారు.

రూ.50 లక్షలకుపైగా వ్యాపారం

కర్నూలు నగరంలో సీక్యాంపు కూడలి, కృష్ణానగర్, చెన్నమ్మ కూడలి, బళ్లారి చౌరస్తా, నంద్యాల చెక్‌పోస్టు, వెంకటరమణ కాలనీ, కొత్త బస్టాండ్, రాజ్‌విహార్, పాత నగరంలోని పూలబజారు తదితర ప్రాంతాల్లో పూలు విక్రయిస్తారు. వీరితోపాటు వీధుల్లో తోపుడుబండ్లపై పూల వ్యాపారం సాగించేవారున్నారు. పూలను ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి దిగుమతి చేసుకొని వ్యాపారం సాగిస్తున్నారు. మాల తయారీకి వాడే పూలు, అలంకరణ పూలను మాత్రం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటుంటారు. అయితే పండగ నేపథ్యంలో ఎక్కువగా చెండు, చామంతి, గులాబీ, మల్లె పూలకు గిరాకీ బాగుంది. కర్నూలు నగరంలో పండగ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లోనే రూ.50 లక్షల వరకు వ్యాపారం సాగుతుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

చైన్ స్నాచర్లపై నిఘాకు పోలీసు కేంద్రం ఏర్పాటు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలులోని వెంకటరమణ కాలనీలో గొలుసు దొంగతనాలను కట్టడి చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ నాగరాజరావు ఆయా కాలనీలో గురువారం పోలీసు కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో ఉండే పోలీసుల ఆయా కాలనీలో పహారా కాయనున్నారని పేర్కొన్నారు.



వెంకటరమణకాలనీలో పోలీసు కేంద్రం వద్ద సీఐ నాగరాజరావు

రెండో పటాలం అదనపు దళాధిపతిగా నాగేంద్రరావు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఏపీ ఎస్పీ రెండో పటాలం అదనపు దళాధిపతిగా నాగేంద్రరావు నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 17 మంది అసిస్టెంట్లకు అదనపు దళాధిపతిగా పదోన్నతుల కల్పించారు. ఇందులో భాగంగా గ్రేహౌండ్స్‌లో అసిస్టెంట్ దళాధిపతిగా ఉన్న ఆయనకు అదనపు దళాధిపతిగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం రెండో పటాలానికి నియమించింది.

సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందండి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి గుండె జబ్బుల రెఫరల్‌గా వచ్చి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స పొందవచ్చని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. గురువారం కార్డియోథోరాసిక్ విభాగంలో 5 హార్ట్ బీటింగ్ సర్జరీలు ఎన్టీఆర్ వైద్య సేవల కింద ఉచితంగా చేసినట్లు పేర్కొన్నారు. అన్ని రకాల గుండె జబ్బులకు ఆధునిక చికిత్సలు అందిస్తున్నామన్నారు. మత్తు మందు వైద్యుడు కొండారెడ్డి, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ హిమబిందు, పీజీలు శస్త్రచికిత్సలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ చెల్లించాలని ఎస్టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్టీటీఎఫ్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు అలాగే ఉంటున్నాయన్నారు. జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. పాత పింఛనును పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పక్కీరయ్య, నందీశ్వరుడు, నరేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్

హామీలు నెరవేర్చకుంటే పోరాటాలకు సిద్ధం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పోరాటాలకు సిద్ధం కావాల్సి వస్తుందని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, వెంకటరమణ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ.. 2000 అక్టోబరు 1న ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ టెలికం నుంచి బీఎస్ఎన్ఎల్‌గా రూపాంతరం చెందిందని, ఆనాడు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండు చేశారు.

మానసిక వ్యాధుల వార్డు తనిఖీ

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి గురువారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక వ్యాధిగ్రస్తుల వార్డును సందర్శించారు. చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వైద్య సేవలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు, ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కలిగించి పండ్లు పంపిణీ చేశారు.

ఉల్లి క్వింటాల్ గరిష్ఠ ధర రూ.3,829

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పంట ఉత్పత్తుల ధరల వివరాలిలా ఉన్నాయి. మార్కెట్‌కు 9,314 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటాల్ కనిష్ఠ ధర రూ.495, మధ్యస్థం రూ.2,819, గరిష్ఠం రూ.3,829కు వ్యాపారులు కొనుగోలు చేశారు. క్వింటాల్‌కు ఐదారు వందల రూపాయలను తగ్గించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగకాయలు క్వింటాల్ రూ.7,170, పూల విత్తనాలు రూ.5,970, ఆముదాలు రూ.5,950, మొక్కజొన్నలు రూ.2,330, కందులు రూ.9,671, ఎండుమిర్చి రూ.7,801, కొర్రలు రూ.3,091, మినుములు రూ.8,329, సజ్జలు రూ.2,100కు వ్యాపారులు ఈ.నామ్ ద్వారా కొనుగోలు చేశారు.

మల్లన్న సేవలో రాష్ట్ర మంత్రులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం రాత్రి దర్శించుకున్నారు. శ్రీశైలం వచ్చిన వారికి ఆలయ మహాద్వారం వద్ద దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మంత్రులకు అర్చకులు వేదాశీర్వచనాలు పలికి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోటీలో పతకాలు సాధించిన చిన్నారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పతకాలు తీసుకురావాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. అక్టోబరు 6 నుంచి 8 వరకు తిరుపతిలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సుంగధిని, లైక్యశ్రీ, కార్తీక కాంస్య పతకాలు సాధించారు. వీరితోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొన్న వారికి ఆమె జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, శిక్షకుడు షబ్బీర్ హుస్సేన్, క్రీడాకారులు వినోద్, ప్రమోద్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై పునపరిశీలన చేయండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ-పంట నమోదును పునపరిశీలన చేయాలని ఏడీఏ సాలురెడ్డి వ్యవసాయాధికారులను ఆదేశించారు. గురువారం ఏడీఏ కార్యాలయంలో డివిజన్‌లోని అన్ని మండలాల ఏవోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒకే రైతుకు ఒకే ఆధార్‌పై వివిధ సర్వే నంబర్లలో ఈ-పంట నమోదు జరిగిందని, నిజంగా ఆ రైతు పంటలను సాగు చేశారా లేదా అని పరిశీలించాలన్నారు.

పాఠశాలల్లో చిన్నారులకు శిక్షణ ఇవ్వాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: మార్షల్ ఆర్ట్స్‌తో చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ప్రతి పాఠశాలలో మార్షల్ ఆర్ట్‌లో చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని డా.శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద ఏర్పాటు చేసిన తైక్వాండో శిబిరాన్ని, పోటీలను ఆయన ప్రారంభించారు. బాలికలకు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కరాటేలో ప్రతిభ చూపిన చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసినవారిపై చర్యలు తీసుకోండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన యతి నర్సింఘానంద్ ప్రవక్తపై ద్వేష ప్రసంగం చేయడంపై చర్యలు తీసుకోవాలని ఆల్ జమాత్ ముస్లిం సంఘ పెద్దలు గురువారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను కలిపి ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ముస్లిం మతపెద్దలు ముస్తి సయ్యద్ మన్సూర్ అహ్మద్, సయ్యద్ షఫీ పాషా ఖాద్రి, సయ్యద్ జాకీర్ అహ్మద్ రషాది, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

మార్గబిలం.. ప్రమాదకరం



నగరంలోని చిన్న పార్కు సమీపంలో మార్గబిలం ప్రమాదకరంగా మారింది. ఎటువంటి రక్షణ పరికరం లేకపోవడంతో రాకపోకలు సాగించే సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు అందులో ఇరుక్కుపోవడంతో ఇబ్బందులు పడటంతోపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనచోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం